బుధవారం
27-8-2025
విజయవాడ ప్రచురణ
సంపుటి : 74, సంచిక : 67
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం



ప్రజా సమస్యలపై
ఉద్యమాలు ఉద్ధృతం

- రాష్ట్ర ప్రభుత్వం 'సూపర్ సిక్స్' అమలు చేయాలి
- బ్లాక్ మార్కెట్లో ఎరువులు...చోద్యం చూస్తున్న డబుల్ ఇంజన్ సర్కారు
- సీపీఐ జాతీయ మహాసభల అనంతరం రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక
- రాష్ట్ర మహాసభలు విజయవంతం...అందరికీ ధన్యవాదాలు
- మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- రాష్ట్ర మహాసభలు ఆమోదించిన 62 తీర్మానాలు విడుదల

విశాలాంధ్ర-ఒంగోలు: రానున్న కాలంలో పేదల పక్షాన మరిన్ని ఉద్యమాలు ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పేర్కొన్నారు. సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు విజయవంతమైన సందర్భంగా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో మంగళవారం పార్టీ జిల్లా సమితి ఆధ్వర్యాన నిర్వహించిన మీడియా సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై 62 తీర్మానాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ 62 తీర్మానాలను రాష్ట్ర మహాసభల ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందన్నారు. రానున్న కాలంలో ఆయా సమస్యలపై పోరాటాలు మరింత ఉధృతం చేసి ప్రజల పక్షాన నిలుస్తామని పేర్కొన్నారు. 32 మంది బలిదానంతో తెలుగు ప్రజల సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర మహాసభలలో ఆమోదించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పేదలకు పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు వంతున నివేశిత స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో సీపీఐ పేదలకు ఇళ్ల స్థలాలు వచ్చేంతవరకు పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని విమర్శలు చేశారన్నారు. జగన్ ప్రభుత్వం చేసుకున్న సోలార్ అగ్రిమెంట్ కారణంగా 25 ఏళ్ల పాటు రాష్ట్రంలోని పేదలపై రూ. ఒక లక్ష పదివేల కోట్లు భారం పడుతుందని తెలిపారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు నాయుడు అదే అగ్రిమెంట్‌ను అనుసరిస్తూ పేదలపై విద్యుత్ భారాలు మోపుతున్నారన్నారు. దీనికి వ్యతిరేకంగా వ్యతిరేకంగా ఈనెల 28వ తేదీన కలిసిపోచ్చే అన్ని రాజకీయ పార్టీలను

- మిగతా 2 లో

పారిశ్రామిక వేత్తలుగా
లక్షమంది మహిళలు

- ఈ లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలి
- రాజధానిలో బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు
- అమరావతి రైతుల రిటర్న్‌బుల్ ప్లాట్లకు రుణాలు
- ఎస్ఎల్బీసీ సమావేశంలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త విధానంలో భాగంగా వచ్చే ఏడాది మార్చి 8వ తేదీన జరగబోయే మహిళా దినోత్సవం నాటికి లక్ష మంది పారిశ్రామిక వేత్తలను తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, దీనికి బ్యాంకర్లు పూర్తిగా సహకరించాలని సీఎం చంద్రబాబు నాయుడు కోరారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో 232వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. వ్యవసాయం, ప్రాథమిక రంగాలు, ఎంఎస్ఎంఈ, డ్వాక్రా గ్రూపులకు రుణ వితరణ లక్ష్యాలు, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలపై చర్చించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రాధాన్యతలను ముఖ్యమంత్రి వివరించారు. అలాగే ఏయే రంగాల్లో సహకారం కావాలనే అంశాన్ని సీఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బ్యాంకులు అందించే సహకారాన్ని అందుకుని ఏపీ డ్వాక్రా మహిళలు ప్రగతి పథాన నడుస్తున్నారు. ఇప్పటికే మహిళలు వివిధ రంగాల్లో వ్యాపారాలు చేస్తున్నారు. స్వయం ఉపాధి పొందుతున్నారు. వారికి మరింత తోడ్పాటు ఇచ్చే విధంగా వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్ పెన్యూయర్ విధానాన్ని వారికి వర్తింప చేసి మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయడం లక్ష్యంగా

- మిగతా 2 లో



సెలవు

వినాయక చవితి సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. కావున గురువారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం శుక్రవారం.

4న మంత్రివర్గ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : వచ్చే నెల 4వ తేదీ ఉదయం 11 గంటలకు వెలగపూడి సచివాలయంలోని మొదటి బ్లాక్ లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశానికి తీసుకువెళ్లాల్సిన ప్రతిపాదనలను సెప్టెంబర్ 2వ తేదీ సాయంత్రం 4 గంటలకల్లా సాధారణ పరిపాలన శాఖ (కేబినెట్ విభాగం)కు పంపాల్సిందిగా అన్ని శాఖలకు రాష్ట్ర

- మిగతా 2 లో

గవర్నర్లకు ఆ అధికారం ఉందా?

న్యూఢిల్లీ: ఆమోదం కోసం వచ్చిన బిల్లులను నిలిపివేసేందుకు గవర్నర్‌కున్న అధికారం మనీ బిల్లులకూ వర్తిస్తుందా అని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. అటువంటి బిల్లులను ఆలస్యం చేయడానికి లేదా నిరవధికంగా నిలిపివేయడానికి అనుమతి ఉందా అని కూడా అడిగింది. రాష్ట్రపతికి సిఫార్సుల వ్యవహారంలో సీజేఐ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ ఏఎస్ చంద్రుర్కర్‌తో కూడిన ఐదురుగు సభ్యుల ధర్మాసనం విచారించింది. విచారణ

- మిగతా 2 లో

'డిజిటల్ పన్ను' దేశాలపై అదనపు సుంకాలు: ట్రంప్

2లో

ఇజ్రాయిల్‌తో తెగతెంపులు

'డొనేషన్ల' మాటున దోపిడి!

- కోట్లు కొల్లగొడుతున్న యాజమాన్యాలు
- నిబంధనల సడలింపు...
- వైద్య కళాశాల అధిపతుల ఆధిపత్యం
- సీట్లకు కోతపడకుండా అక్రమ మార్గాలు
- సిబ్బందినే రోగులుగా చూపుతున్న వైనం
- నిరుపేదలకు శాపంగా కార్పొరేట్ వైద్యం
- ప్రభుత్వానికి ఫలితం శూన్యం

విశాలాంధ్ర -సచివాలయం: రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ వైద్య విద్యాసంస్థలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. ఇవన్నీ సీట్ల డొనేషన్ల పేరుతో ఏటా వందల కోట్లు సంపాదిస్తున్నాయి. సామాజిక బాధ్యత నిర్వర్తించడం లేదు. విద్య, వైద్యంపై ప్రభుత్వం ఎక్కువ శ్రద్ధ పెడుతోంది. ముఖ్యంగా ఆరోగ్య రంగానికి సంబంధించి అనేక పథకాల్ని అమలు చేస్తోంది. ఇందుకోసం వందలు, వేల కోట్లు వ్యయం చేస్తున్నా ఆశించిన ఫలితాలు రావడంలేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయాలు లభించడం లేదు. గతంలో వైద్య కళాశాల ఏర్పాటుకు అనుమతివ్వాలంటే వరుసగా ఐదేళ్ల పాటు నిర్ణీత సంఖ్యలో పడకలతో కూడిన అన్ని విభాగాల వైద్య నిపుణులతో నిండిన ఆసుపత్రిని నిర్వహించాల్సి ఉండేది. అనంతరం అండర్ గ్రాడ్యుయేట్ తొలి సంవత్సర

- మిగతా 2 లో

బార్ లైసెన్సులకు స్పందన కరువు

- 840లో 43 బార్లకు 4చొప్పున దరఖాస్తులు
- టెండర్ల గడువు 29 వరకు పొడిగింపు
- పాలసీలో మార్పునకు బార్ యజమానుల పట్టు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో బార్ లైసెన్సుల అప్లికేషన్లకు స్పందన కొరవడటంతో టెండర్ల గడువును ప్రభుత్వం పొడిగించింది. టెండర్ల గడువును ఈ నెల 29 సాయంత్రం 6 గంటల వరకు పొడిగిస్తున్నట్టు ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలోని 840 బార్లకు కొత్త పాలసీ మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. అయితే ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాలపై మద్యం వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో టెండర్ల గడువు సమీపిస్తున్నా వారి నుంచి దరఖాస్తులు రాలేదు. వాస్తవానికి మంగళవారం సాయంత్రంతో దరఖాస్తు గడువు ముగిసింది. ఇప్పటి వరకు

- మిగతా 2 లో

లిథువేనియా ప్రధానిగా కార్మిక నాయకురాలు

దేశ పగ్గాలు చేపట్టిన ఇంగా రుగినియెన్

విల్నియస్: లిథువేనియా దేశానికి కొత్త ప్రధానిగా ఇంగా రుగినియెన్ మంగళవారం ఎన్నికయ్యారు. ఆమె ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ మాజీ చైర్‌పర్సన్. గతేదాది సార్వత్రిక ఎన్నికలకు ముందు సెంటర్ లెఫ్ట్ సోషల్ డెమొక్రటిక్ పార్టీలో చేరారు. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన కార్మిక నాయకురాలికి దేశ పగ్గాలు కట్టబెట్టేందుకు శాసనసభులు ఆమోదం తెలిపారు. వ్యాపార కార్యకలాపాల్లో అవకతవకలకు సంబంధించి విచారణ క్రమంలో గింటౌటస్ పలుకాస్ రాజీనామా చేశారు. అనంతరం ఇంగా రుగినియెస్ ఈ పదవీ బాధ్యతలు చేపట్టారు. కొత్త ప్రధానిగా రుగినియెస్ పేరును అధ్యక్షులు గిటానస్ నౌసెదా ప్రతిపాదించారు. పార్లమెంటులో ఓటింగ్ అనంతరం నూతన ప్రధానిగా రుగినియెస్ పగ్గాలు చేపట్టారు. సభలో మాట్లాడుతూ సుస్థిరతను పునరుద్ధరిస్తానని సంకల్పించారు. ఓటర్లు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే ప్రభుత్వం పనిచేస్తుందని హామీనిచ్చారు. ఇంగా రుగినియెన్ 2018 నుంచి 2024 వరకు లిథువేనియన్ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ చైర్ పర్సన్‌గా ఉన్నారు. 2023-24లో యూరోపియన్ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా పని చేశారు.12 డిసెంబర్ 2024 నుంచి లిథువేనియా సామాజిక భద్రత-కార్మిక శాఖ మంత్రిగా వ్యవహరించారు. గింటౌటాస్ పలుకాస్ రాజీనామా తర్వాత ప్రధాన మంత్రి అభ్యర్థిగా రుగినియెన్‌ను సోషల్ డెమొక్రాట్లు నామినేట్ చేశారు. ఆమెను నూతన ప్రధానిగా అధ్యక్షుడు ప్రతిపాదించగా, చట్టసభ ఆమోదించింది. దీంతో ఆమె ప్రమాణ స్వీకారంచేశారు.

ఇజ్రాయిల్‌తో తెగతెంపులు

- గ్రీస్ ప్రజల డిమాండ్
- భారీ ర్యాలీలు
- కమ్యూనిస్టు పార్టీ, కార్మిక సంఘాల మద్దతు

ఏథెన్స్: ఇజ్రాయిల్‌తో సంబంధాలు తెంచుకోవాలన్న డిమాండ్ గ్రీస్ అంతటా మార్మోగింది. గాజాలో ఇజ్రాయిల్ దురాక్రమణను నిలిపివేయాలంటూ గ్రీస్ ప్రజలు ఒక్కటయ్యారు. మారణహోమాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ఇజ్రాయిల్‌తో పూర్తిగా తెగతెంపులు చేసుకోవాలని గ్రీస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలస్తీనాకు విముక్తి కల్పించాలని, అన్ని కారిడార్లు తక్షణమే తెరవాలని, పలస్తీనియన్లకు సహాయం అందేలా చూడాలని నినాదాలు చేస్తున్నారు. పలస్తీనాకు మద్దతుగా వేలాది మంది వీధుల్లోకి వచ్చి భారీస్థాయిలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. గ్రీస్‌లోని ప్రధాన నగరాల్లో ర్యాలీలు జరిగాయి. పలస్తీనాకు అనుకూలంగా, ఇజ్రాయిల్‌కు, గ్రీస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. కార్మిక సంఘాలతో పాటు గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) సంపూర్ణ మద్దతిచ్చింది. 'పలస్తీనా ప్రజలను పస్తులు ఉంచి చంపేస్తున్నారు... వారి భూభాగంలోకి వెళ్లి మారణహోమం సృష్టిస్తున్నారు. ఇటువంటి యుద్ధ నేరస్తుడికి గ్రీస్ ప్రభుత్వం మద్దతు ఇస్తుండటం ఆమోదయోగ్యం కాదు. ఇదంతా తక్షణమే ఆగిపోవాలి. హంతక దేశంతో అన్ని సంబంధాలు తెంచుకోవాలి' అని ఏథెన్స్ ర్యాలీలో పాల్గొన్న కేకేఈ ప్రధాన కార్యదర్శి దిమిత్రిస్ కౌట్సోంబస్ ఉద్ఘాటించారు. ఆల్ వర్కర్స్ మిలిటెంట్ ఫ్రంట్ (పీఏఎంఈ) కూడా వ్యతిరేక గళం వినిపించింది. యూరోపియన్ దేశాలు, అమెరికా, నాటో కలిసి ఇజ్రాయిల్‌కు మద్దతివ్వడాన్ని తీవ్రంగా ఖండించింది. వేలాది మంది మహిళలు, పిల్లల ఊచకోతకు సహకారాన్ని ఆక్షేపించింది.

పలస్తీనాకు సంఘీభావం ప్రకటించింది. పలస్తీనాకు మద్దతివ్వడం నేరమన్నట్లుగా యూరప్ చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేసింది. 'ఐడీఎఫ్ హంతకులకు గ్రీస్ పోర్టులో అడుగు పెట్టనివ్వం... కార్మిక నగరంలో కాలు మోపనివ్వం' అంటూ పీఏఎంఈ ప్రకటించింది. అమాయక పిల్లలు, గాజా పౌరులను హతమార్చే యుద్ధ నేరస్తులకు పర్యాటక ప్రాంతంగా గ్రీస్‌ను మారనివ్వబోమని సంకల్పించింది. తమ ప్రాణాలు కాపాడుకోవడం కోసం, న్యాయం, స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న పలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతున్నామని నిర్మాణ కార్మికుల సమాఖ్య నాయకుడు వాల్సమోస్ సిరిగోస్ ఉద్ఘాటించారు. సంకల్పముంటే ఏది అసాధ్యం కాదని పలస్తీనా ప్రజలు గత రెండేళ్లుగా నిరూపిస్తున్నారన్నారు. కాళ్లకు చెప్పులు లేకపోయినాగానీ ప్రపంచంలోనే అత్యంత కిరాతక యుద్ధ యంత్రాన్ని ఎదుర్కోగలమని, మాతృభూమిని పరిరక్షించుకోవడం కోసం పోరాడగలమని రుజువు చేస్తున్నారని సిరిగోస్ వెల్లడించారు.

త్వరలో కిమ్‌తో ట్రంప్ భేటీ!

వాషింగ్టన్/సియోల్: ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్‌తో ఈ ఏడాది భేటీ కావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆకాంక్షించారు. దక్షిణ కొరియాతో వాణిజ్య చర్చలకు సానుకూలంగా ఉన్నట్లు తెలిపారు. దక్షిణ కొరియా నూతన అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ అమెరికాలో పర్యటించారు. శ్వేతసౌధ్యంలో ట్రంప్ ఆయనకు స్వాగతం పలికారు. ఇద్దరు అధినేతలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పరస్పరం మరింతగా సహకరించుకోవాలని నిర్ణయించారు. అనంతరం ఓవల్ కార్యాలయంలో విలేకరులతో సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ 'సమీప భవిష్యత్‌లో పరిస్థితులు అనుకూలంగా సమయంలో కిమ్ జాంగ్ ఉన్‌తో సమావేశం కోసం ఎదరు చూస్తున్నా' అని అన్నారు. ట్రంప్‌ను శాంతి దూతగా లీ జే మ్యూంగ్ ప్రశంసించారు. నౌకల నిర్మాణంతో పాటు ఇతర తయారీ రంగాల్లో అమెరికాతో సహకారాన్ని మరింత విస్తరించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అమెరికా సీనియర్ అధికారులతో కలిసి ఆయన బిజినెస్ ఫోరంలో పాల్గొన్నారు. ఈ సదస్సులో 20కుపైగా అమెరికా కంపెనీలు, దక్షిణ కొరియా కంపెనీలకు చెందిన సీఈఓలు, అధికార ప్రతినిధులు హాజరయ్యారు. ఇదిలావుంటే, తమ అధినేతతో భేటీని ట్రంప్ కోరడంపై ఉత్తర కొరియా స్పందించలేదు. అయితే దక్షిణ కొరియాతో కలిసి అమెరికా సైనిక

విన్యాసాలు నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండించింది. కొరియా ద్వీపకల్పాన్ని ఆక్రమించుకోనే ప్రయత్నంగా దుయ్యబట్టింది. ఆ ప్రాంత దేశాలను లక్ష్యంగా చేసుకోవడమే అమెరికా ఉద్దేశంగా పేర్కొంది.

'డిజిటల్ పన్ను' దేశాలపై అదనపు సుంకాలు: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పేరిట రోజుకో ప్రకటన చేస్తున్నారు. డిజిటల్ పన్నుల నుంచి మినహాయింపు ఇవ్వకపోతే ఆయా దేశాల ఎగమతి వస్తువులపై అదనపు సుంకాలు విధిస్తామని హెచ్చరించారు.

డిజిటల్ సర్వీసెస్ యాక్ట్ అమలు కోసం బాధ్యగల యూరోపియన్ యూనియన్ లేక సభ్య దేశాలపై ఆంక్షలు విధించే యోచనలో ట్రంప్ యంత్రాంగం ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించారు. ఆల్ఫబెట్ గూగుల్, మెటా ఫేస్‌బుక్, యాపిల్, అమేజాన్ వంటి డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల అమ్మకాల సంబంధిత ఆదాయంపై అనేక దేశాలు ముఖ్యంగా యూరప్ పన్నులు విధించాయి. ఇది అమెరికా యంత్రాంగానికి తలనొప్పిగా మారింది. 'ఇలాంటి వివక్షపూరిత చర్యలను ఆపకపోతే ఆ దేశాల నుంచి అమెరికాకు జరిగే ఎగుమతులపై గణనీయమైన అదనపు సుంకాలను విధిస్తామని డిజిటల్ పన్నులు, శాసనాలు, నియమ నిబంధనలు అమలు చేసే దేశాలకు తేల్చిచెబుతున్నా' అని ట్రూత్ సోషల్‌లో ట్రంప్ వెల్లడించారు. అమెరికా సాంకేతికతను దెబ్బతీసే ఉద్దేశంతోనే ఇటువంటి వివక్షపూరిత చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు.

ప్రజా సమస్యలపై ఉద్యమాలు ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

కలుపుకొని ప్రజా ఉద్యమం నిర్మిస్తామని హెచ్చరించారు. సుపరిపాలన, డబుల్ ఇంజన్ సర్కార్ అని పేర్కొంటున్న కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్లో ఎరువులను సక్రమంగా అందించడంలో విఫలం అయిందని రామకృష్ణ విమర్శించారు. ఒకవైపు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు 31 లక్షల 15 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని, ప్రస్తుతం రాష్ట్రంలో 21 లక్షల 34,3ల ఎరువులే ఉన్నాయని, మిగిలిన వాటిని కోసం కూడా ఇండెంట్ పెట్టామని ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఎరువులు అంత సమృద్ధిగా ఉన్నట్లయితే... నేడు బ్లాక్ మార్కెట్లో 250 రూపాయల బస్తా యూరియా రూ. 500 ఎందుకు పలుకుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు వేకువజామునే వచ్చి లైన్లో నిలబడుతున్నప్పటికీ కనీసం బ్లాక్ మార్కెట్లో కూడా ఎరువులు దొరకట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా స్మార్ట్ ప్రభుత్వం అని ప్రశ్నించారు. డబుల్ ఇంజన్ సర్కార్ లో కేంద్రం నుండి కనీసం ఎరువులు కూడా తెప్పించుకోలేరా అని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున యుద్ధ ప్రాతిపదిక న ప్రభుత్వం వెంటనే ఎరువుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ... సీపీఐ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర కౌన్సిల్‌కు 101 మందిని, పదిమంది కాండేట్ సభ్యుల్ని ఎన్నుకోవడం జరిగిందన్నారు. అలాగే 31 మంది సభ్యులు, ఇద్దరు ఆహ్వానితులతో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఇక సెక్రటేరియట్, అసిస్టెంట్ సెక్రటరీ, సెక్రటరీ లను పార్టీ జాతీయ మహాసభల అనంతరం విజయవాడలో కౌన్సిల్ ఏర్పాటు చేసి జాతీయ నాయకుల సమక్షంలో ఎన్నుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కే నారాయణ లకు అత్యవసర పనులున్న కారణంగా సెక్రెటరీ ఎన్నిక వాయిదా పడినట్లు తెలిపారు. వారి సూచనల మేరకు అప్పటివరకు సెక్రటేరియట్, అసిస్టెంట్ సెక్రటరీలు, రాష్ట్ర సెక్రటరీ ని యథాతథంగా కొనసాగించాలని సూచించారన్నారు. రాష్ట్ర మహాసభ కేవలం రాష్ట్ర కౌన్సిల్ ఎన్నుకోవడంతో ముగిసిందని రామకృష్ణ పేర్కొన్నారు. కౌన్సిల్ సమావేశంలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని, కార్యదర్శి వర్గాన్ని, అసిస్టెంట్ సెక్రటరీలను, సెక్రటరీలను ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర మహాసభ విజయవంతంలో పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించినందుకు మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్ర మహాసభల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

రాష్ట్ర మహాసభలలో ఏకగ్రీవమైన తీర్మానాలు ఇవే...

ఈనెల 23వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఒంగోలులో జరిగిన సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలలో 62 తీర్మానాలను మహాసభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అవి: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో జరుగుతున్న ముస్లిం మైనార్టీలపై దాడులను ఖండిస్తూ, ఆచార వ్యవహారాలపై వేధింపులను ఖండిస్తూ, ఉపాధి రంగం నుండి ముస్లింలను దూరంగా పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్న తీరును విమర్శిస్తూ, ముస్లిం మైనార్టీలపై ఉన్న వివక్షను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఇన్సాఫ్ ఆధ్వర్యంలో తీర్మానం ప్రవేశపెట్టడం జరిగింది.

విశాఖ సమగ్ర అభివృద్ధి ద్వారానే ఆర్థిక ప్రగతి సాధించుకోవచ్చని తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ప్రాధాన్యత క్రమంలో సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్‌తో మరో తీర్మానం ప్రవేశపెట్టడం జరిగింది. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్‌తో మరో తీర్మానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా, ముస్లింలను వేధించే విధంగా తీసుకువచ్చిన చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మరో తీర్మానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు సంస్థకు కేటాయిస్తూ ఇచ్చిన జీవో నెంబర్ 137ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, ఆర్టీసీలో విద్యుత్ బస్సులను ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీనే నిర్వహించాలని, విద్యుత్ బస్సులను ఆర్టీసీ సిబ్బంది ద్వారా నడిపించాలని, స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలు జరిగేందుకు తక్షణమే మూడు వేల కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, 10వేల మందికి పైగా సిబ్బంది నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మరో తీర్మానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది.

చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం తీసుకువచ్చిన 11 రకాల రిజర్వేషన్ యాక్టులను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మరో తీర్మానాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది. ప్రభుత్వ బ్యాంకుల్లోనే ఉద్యోగ కార్మికుల ఖాతాలు ఉంచాలని డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది. ఉపాధి హామీపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న పరిమితి పేదలకు నష్టమని ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందామంటూ మరో తీర్మానాన్ని రాష్ట్ర మహాసభలలో ప్రవేశపెట్టడం జరిగింది. మహిళా సాధికారత, రక్షణ, భద్రతపై ప్రభుత్వ చర్యల్ని డిమాండ్ చేస్తూ మరో తీర్మానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది.

న్యాయవాదుల రక్షణ కోసం చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ మరో తీర్మానాన్ని రాష్ట్ర మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. వెనుకబడిన సత్యసాయి జిల్లా సమగ్రాభివృద్ధికై తీర్మానం ప్రవేశపెట్టడం జరిగింది. విద్యార్థుల హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని, విద్యార్థి, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలను విద్యాసంస్థల్లోకి అనుమతించకపోవడాన్ని తక్షణమే విరమించుకోవాలని, మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ మరో తీర్మానం ప్రవేశపెట్టడం జరిగింది. చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని, చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని విభాగాలకు సంబంధించిన నైపుణ్యం కలిగిన ప్రభుత్వ డాక్టర్లను నియమించాలని డిమాండ్ చేస్తూ, దేశంలో అత్యంత వెనుకబడిన కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధికి రూ.50 వేల కోట్లు ప్రభుత్వ నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఉత్పత్తి పారిశ్రామికవాడలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు తీర్మానాలు ప్రవేశపెట్టడం జరిగింది. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 58 సంవత్సరాలకు తగ్గించాలని డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. చేతి వృత్తిదారుల సమస్యలపై, కొప్పర్తి మెగా పారిశ్రామిక కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం అధ్వర్యంలో ఏర్పాటైన ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ను అమరావతికి తరలించడాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం ప్రవేశ పెట్టడం జరిగింది.ఏపీ ఫైబర్‌నెట్లను ప్రైవేటు పరం చేయరాదని, ఆపరేషన్ బుడమేరును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలు ప్రవేశపెట్టడం జరిగింది. ఇవే కాకుండా రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న మరో 10 సమస్యలపై తీర్మానాలను రాష్ట్ర మహాసభల్లో ప్రవేశ పెట్టగా... వీటికి మహాసభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ మీడియా సమావేశంలో సీపీఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పాల్గొన్నారు.

గవర్నర్లకు ఆ అధికారం ఉందా?

(మొదటిపేజీ తరువాయి)

నాల్గో రోజు మంగళవారం సాగింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. గవర్నర్ ఏదేని బిల్లును నిలిపివేస్తే, అది రద్దు అవుతుందని చెప్పారు. ఆమోదించని బిల్లులను అసెంబ్లీ పున:పరిశీలనకు తిప్పి పంపాలని తమిళనాడు, పంజాబ్ గవర్నర్ల కేసుల్లో సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేశారు. బిల్లులను ఆమోదించడం కోసం గవర్నర్లకు, రాష్ట్రపతికి గడువు నిర్దేశించడం వారికి ఉండే విచక్షణాధికారాలను తక్కువ చేయడమే అవుతుందని వాదించారు. మహారాష్ట్ర తరపున సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే కోర్టుకు హాజరయ్యారు. బిల్లులను ఆమోదించే అధికారం గవర్నర్ లేక రాష్ట్రపతికి ఉంటుందని కోర్టులకు లేదని వాదించారు. గవర్నర్ జాప్యం చేసినంత మాత్రానా రాజ్యాంగబద్ధ తప్పిదం అయిపోదన్నారు. గవర్నర్‌కు ఎలాంటి గడవు ఉండదని వాదనలు వినిపించారు. ఆయన సింహాసనంపై కూర్చొని నిర్ణయాలు తీసుకోవడం లేదన్నారు.

రాజస్థాన్ తరపున సీనియర్ న్యాయవాది మనీందర్ సింగ్, పుదుచ్చేరి తరపున సీనియర్ న్యాయవాది వినయ్ నవారే, గోవా తరపున అదనపు సొలిసిటర్ జనరల్ విక్రమ్‌జిత్ బెనర్జీ, మధ్యప్రదేశ్ తరపున సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్, చత్తీస్‌గఢ్ తరపున సీనియర్ న్యాయవాది మహేశ్ జత్మలానీ వాదనలు వినిపించారు. ఏదని శాసనం గవర్నర్ ఆమోదం లేకుండా చట్టరూపం దాల్చలేదని, ఈ వ్యవహారాల్లో కోర్టు జోక్యం చేసుకోరాదని గోవా తరపున బెనర్జీ వాదించారు. లాంఛన ప్రాయంగా భావిస్తే అసలు గవర్నర్ ఆమోదం కోసం బిల్లులను పంపాల్సిన అవసరం ఏమిటని మధ్యప్రదేశ్ న్యాయవాది కౌల్ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే గవర్నర్ నిర్ణయం కీలకమని చత్తీస్‌గఢ్ న్యాయవాది జత్మలానీ అన్నారు. మనీ బిల్లులకు నిర్దేశిత కాలం ఉండదని వాదించారు. వాదనలు అసంపూర్తిగా ఉండటంతో తదుపరి విచారణ ఈనెల 28వ తేదీన జరగనుంది. ఆ రోజు ప్రత్యర్థి పార్టీలు తమ వాదనలు వినిపిస్తాయి.

'డొనేషన్ల' మాటున దోపిడి!

(మొదటిపేజీ తరువాయి)

ప్రవేశాలకు అనుమతులిచ్చేవారు. తదుపరి ప్రతి ఏటా నిర్దీత పడకలతో కూడిన ఆసుపత్రిని కొనసాగించాలి. అందులోనూ ఏడాది పొడవునా రోగులుండాలి. ప్రత్యేక నిపుణులతో పాటు అన్ని విభాగాలకు చెందిన అర్హత గల వైద్య బోధకులు సిబ్బందిగా ఉండాలి. ఇందుకోసం కార్పొరేట్ ఆసుపత్రులన్నీ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేవి. వైద్య నిపుణులందర్నీ ఈ శిబిరాలకు పంపేవి. గ్రామాల్లో రోగుల్ని పరీక్షించి వైద్యసేవలు అవసరమైన వారిని గుర్తించేవి. తమ సొంత బస్సుల్లోనే వారిని తమ ఆసుపత్రులకు తీసుకొచ్చేవి. వారిని ఇన్‌పేషంట్లుగా చేర్చుకుని వైద్యం అందించేవి. వారికి భోజనం, మందుల్ని ఉచితంగా సమకూర్చేవి. పూర్తిస్థాయిలో స్వస్థత పొందిన తర్వాత తిరిగి తమ బస్సుల్లోనే వారి స్వగ్రామాల్లో వదిలి పెట్టేవి.

ఇలా ప్రభుత్వాలు, వైద్య విద్య విభాగ అధిపతులు, విశ్వ విద్యాలయ నిర్దేశం మేరకు ఏడాది పొడవునా తమకు కేటాయించిన సీట్లకనుగుణంగా పడకలపై రోగులుండేలా చూసుకునేవి. ఉన్నతాధి కారుల తనిఖీల సమయంలో పడకలు ఖాళీగా ఉంటే తమ సిబ్బందిని రోగులుగా చూపిస్తూ పడకలపై పడుకోబట్టేవి. అలాగే అప్పటికప్పుడు కొంతమందిని తెచ్చి రోగులుగా లెక్కల్లో చూపేవి. ఇలా తమ అవసరం కోసం గ్రామీణ స్థాయిలో కార్పొరేట్ వైద్య సేవల్ని అందించేవి. క్రమ పద్ధతిలో రోగుల సంఖ్య లేనిపక్షంలో తదుపరి ఏడాదికి సంబంధించి వైద్య విద్య సీట్లలో కోత పడేది. తిరిగి ఈ సంఖ్యను పునరుద్దరించుకోవడం ఆషామాషీకాదు. పైగా ఒక్క సీటు తగ్గినా కోట్ల రూపాయల ఆదాయం గల్లంతవుతుంది. దీంతో కార్పొరేట్ ఆసుపత్రులన్నీ ఒకప్పుడు గ్రామాల బాటపట్టేవి. ప్రభుత్వం, వైద్య విద్య విభాగాలు ఈ నిబంధనల్ని సడలించేశాయి. వీటిని సక్రమంగా అనుసరించడం లేదు. కార్పొరేట్ వైద్య విద్యాసంస్థల అధిపతుల ఆధిపత్యం పెరిగింది. దీంతో అనుబంధ ఆసుపత్రుల్లో పడకలు, రోగులు, పరిశీలన వంటి అంశాలన్నీ పక్కకుపోయాయి.

మరోవైపు అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ సెట్‌కు రెండు కోట్లు, పీజీకి ఐదు నుంచి 10 కోట్ల రూపాయల చొప్పున డొనేషన్లు పెరిగాయి. ప్రభుత్వం నిర్దేశించిన బీ కేటగిరి సీట్ల ఫీజులు కూడా లక్షల్లోకి చేరాయి. ఏటా ఒక్కో వైద్య కళాశాల 150 నుంచి 200 కోట్ల రూపాయల వరకు డొనేషన్ల రూపంలో నల్ల డబ్బును సమకూర్చుకుంటున్నాయి.

బార్ లైసెన్సులకు స్పందన కరువు

(మొదటిపేజీ తరువాయి)

43 బార్లకు మాత్రమే 4 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు వచ్చిన మొత్తం 437 దరఖాస్తుల్లో 43 షాపులకు 4 చొప్పున 132 దరఖాస్తులు వచ్చాయి. మిగతా వాటి కోసం కేవలం ఒకటి, రెండు చొప్పున దరఖాస్తులు మాత్రమే రావడంతో ఎక్సైజ్ అధికారులు ఖంగుతిన్నారు. దీంతో తుది గడువును ప్రభుత్వం ఆగస్టు 29 వరకు పెంచింది. అయినా సరే దరఖాస్తులు పెట్టబోమని మద్యం వ్యాపారులు అంటున్నారు. పాలసీలో మార్పులు చేయాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఆచరణ సాధ్యం కాని పాలసీని తీసుకొచ్చారని వ్యాపారుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ హయాంలో ప్రభుత్వమే మద్యం షాపులను నిర్వహించడం, మందు బాబులకు అవసరమైన బ్రాండ్‌లు మద్యం షాపుల్లో లభించకపోవడం, పర్మిట్ రూమ్ సదుపాయం లేకపోవడం తదితర కారణాలతో బార్ అండ్ రెస్టారెంట్‌ల వ్యాపారం బాగానే సాగింది. అయితే ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం మద్యం షాపుల్లో ఎంఆర్‌పీ ధరలకే విక్రయిస్తుండటంతో పాటు ప్రభుత్వం పర్మిట్ రూమ్‌లకు అవకాశం ఇవ్వడంతో బార్‌లలో పెద్దగా వ్యాపారం జరిగే పరిస్థితి ఉండదని వ్యాపారులు భావిస్తున్నారు. అందుకే బార్ లైసెన్సులకు వ్యాపారుల నుంచి స్పందన కొరవడింది. ప్రధానంగా బార్లపై మోపిన అడిషనల్ రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను రద్దు చేయాలని బార్ల యజమానులు కోరుతున్నారు. దీని వల్ల వైన్ షాప్స్ కంటే ఎంఆర్‌పీపై 15 శాతం అధికంగా డబ్బులు పెట్టి మద్యం కొనుగోలు చేయాల్సి వస్తోందని వారు చెబుతున్నారు. ప్రతి బార్ ఏర్పాటుకు కనీసం నాలుగు దరఖాస్తులు రావాలనే నిబంధన ఎత్తివేయాలని బార్స్ లైసెన్స్ కోసం పోటీపడేవారు కోరుతున్నారు. అలాగే ప్రతి సంవత్సరం 10 శాతం లైసెన్స్ ఫీజు పెంపును కూడా రద్దు చేయాలని వారు కోరుతున్నారు. బార్ల యజమానుల సాధకబాధకాలను ప్రభుత్వం తెలుసుకుని నూతన బార్ పాలసీలో మార్పులు చేస్తేనే ప్రభుత్వం ఆశించిన విధంగా బార్ లైసెన్సులు పొందేందుకు వ్యాపారులు ముందుకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

లక్షమంది మహిళలు

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుకున్నాం. ఇందులో భాగంగా 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. వీటిల్లో వీలైనంత మేరకు మహిళలకు అవకాశం ఇస్తాం. డ్వాక్రా మహిళలకు బ్యాంకర్లు ఏ విధంగా సహకరించారో.. దీనికి కూడా బ్యాంకర్లు సహకరించాలని చంద్రబాబు కోరారు.

ఇన్నోవేషన్ కేంద్రాలకు... బ్యాంకర్లు అనుసంధానమవ్వాలి

యువత, మహిళ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా రాష్ట్రంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించాం. ఇప్పటికే అమరావతిలో ప్రధాన కేంద్రం పనిచేయడం మొదలైంది. విశాఖ, రాజమండ్రి, విజయవాడ, అనంతపురం, తిరుపతి వంటి చోట్ల ఐదు ప్రాంతీయ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. అలాగే వీరికి నాలెడ్జ్, ఎడ్యుకేషన్ పార్టనర్లు ఉంటారు. దీనికి బ్యాంకర్ల నుంచి సహకారం ఉండాలి. ఫలితాలు వచ్చేలా ప్రణాళికలు అమలు చేస్తున్నాం. ఐదు ప్రాంతాల్లో ఏర్పాటు చేయబోయే ఇన్నోవేషన్ హబ్ లకు ఆయా ప్రాంతాల్లో ఉండే బ్యాంకుల ప్రతినిధులను అనుసంధానించాలి. ఇది స్టార్టప్ లకు, నైపుణ్యాభివృద్ధికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. బ్యాంకర్లు తక్కువ వడ్డీలతో రుణాలివ్వడం.. తక్కువ మొత్తాలతో అప్పు తీర్చే వెసులుబాటు కలిగించాల్సిన అవసరం ఉంది. బ్యాంకర్ల సమావేశాలు అర్థవంతంగా జరగాలి. రోటీన్ సమావేశాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. ఖరీఫ్ సీజన్లో ఇప్పటికే సగం సమయం గడిచిపోయింది. ఈ పాటికే రైతులకు రుణాలు ఇవ్వాల్సి ఉంటుంది. సీజన్ ఆఖరులో రుణాలు ఇవ్వటం వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం ఉండదు. బ్యాంకులు, పబ్లిక్ పాలసీలు ఎప్పుడూ ప్రజల్ని నియంత్రించేలా కాకుండా... ప్రోత్సహించేలా ఉండాలని సీఎం మార్గనిర్దేశనం చేశారు. అమరావతిలో బ్యాంకులు తమ ప్రధాన కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవాలని, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ను ఏర్పాటు చేసి క్వాంటం వ్యాలీ సేవల్ని వినియోగించుకోవాలని చంద్రబాబు సూచించారు. అమరావతిలో బ్యాంకులకు అవసరమైన భూమిని కేటాయిస్తామన్నారు. రెండేళ్లలో తమ కార్యాలయాలను నిర్మించాలన్నారు. అమరావతి రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు రుణాలిచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావాలని చెప్పారు. కౌలు రైతులకు రుణాలివ్వాలని, ఐడుగులకు ప్రభుత్వం అండగా ఉండడంతోపాటు.. బ్యాంకర్లు కూడా సహకరించాలని కోరారు.

కౌలు రైతులకు రూ.985 కోట్లు

మొత్తంగా వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా అన్ని రంగాలకు కలిపి రూ. 2,47,919 కోట్ల మేర రుణాలను బ్యాంకులు ఇచ్చాయి. ఇందులో వ్యసాయ రంగానికి రూ.94,666 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రూ.49,831 కోట్లు, ఇతర రంగాలకు రూ. 1,00,278 కోట్ల మేర రుణాలను ఇచ్చారు. దీంట్లో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతులకు రూ.985 కోట్ల రుణాల్ని మంజూరు చేశారని కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నాగరాజు చెప్పారు. మచిలీపట్నంలో ఆంధ్ర బ్యాంక్ వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరుతో పార్కు, మెమోరియల్ ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వం రెండెకరాల భూమి కేటాయించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఎస్ఎల్బీసీ ఛైర్మన్ నితీష్ రంజన్, సీడ్బీ సీఎండీ మనోజ్ మిట్టల్, ఎగ్జిమ్ బ్యాంక్ ఎండీ హర్ష బంగారి, కెనరా బ్యాంక్ ఎండీ సత్యనారాయణ రాజు, పంజాబ్ నేషనల్ ఎండీ అశోక్ చంద్ర, ఇండియన్ బ్యాంక్ ఎండీ బినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివాదంలో ఏయూ వీసీ

వర్సిటీ వర్గాల్లో అసహనం

రిజిస్ట్రార్ రాజీనామా

విశాలాంధ్ర-విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల మధ్య వివాదం చిలికి చిలికి గాలి వానగా మారింది. రిజిస్ట్రార్... ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు ఆకస్మిక రాజీనామా గందరగోళం సృష్టించింది. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్ బాధ్యతలు చేపట్టిన రోజు నుంచే రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్, డీన్, అధికారులు, ఆచార్యులతో అంటీ అంటనట్టుగా ఉండటం వివాదానికి కారణమైంది. రిజిస్ట్రార్ సహా ఏ అధికారులైనా అపాయింట్‌మెంట్ లేకుండా ఆయనను కలవలేరు. వర్సిటీ వందేళ్ల చరిత్రలో ఏ వీసీ ఇలా వ్యవహరించలేదు. ఆయన తీరు యూనివర్సిటీ వర్గాలకు కోపం తెప్పించడమే కాకుండా తీవ్ర విమర్శలకు దారితీసింది. రాజకీయ నాయకులు కూడా వీసీని తప్పుపట్టారు. దీంతో ఓ మెట్టు దిగి తనను కలిసేందుకు యూనివర్సిటీ ఆచార్యులకు, అధికారులకు ఓ సమయాన్ని వీసీ నిర్దేశించారు. పాలనాపరమైన అంశాల్లో మాత్రం ఏకపక్షంగా ఉండటం, ఏ విషయంలోనూ సంప్రదింపులు జరపకపోవడం, మరీ ముఖ్యంగా రిజిస్ట్రార్ పనుల్లో జోక్యం చేసుకోవడంతో ఈ వివాదం మరింత ముదిరింది. డీన్, డైరెక్టర్ నియామకాలలో వీసీ ఇష్టారీతిని వ్యవహరిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. గత వీసీలు రిజిస్ట్రార్ అభిప్రాయాన్ని గౌరవించేవారు కానీ వీసీ రాజశేఖర్ అందుకు పూర్తి భిన్నంగా ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులను డమ్మీలుగా మార్చేలా నిర్ణయాలు తీసుకోవడం కలకలం రేపింది. ఐఐటీ తరహాలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 'ఫ్యాకల్టీ అఫైర్స్ డీన్' అనే పోస్టు సృష్టించి, ప్రిన్సిపాల్, విభాగాధిపతులపై పెత్తనానికి ఒకరిని నియమించడం ఆచార్యులకు కోపం తెప్పించింది. సాధారణంగా విద్యా వ్యవహారాలను విభాగాధిపతులు, కళాశాల ప్రిన్సిపాల్స్ చూసుకుంటారు. అలాంటిది 'ఫ్యాకల్టీ అఫైర్స్ డీన్' ఉండాలన్న నిర్ణయం వివాదాస్పదమైంది. ఇందుకోసమే రిజిస్ట్రార్ రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. సరైన వ్యక్తిని వీసీగా నియమించలేదని, ఇది రాష్ట్ర ప్రభుత్వ తప్పిదమని వర్సిటీ వర్గాలు పేర్కొన్నాయి. ముందు నుంచి వివాదాస్పద వైఖరి అవలంభిస్తున్న రాజశేఖర్‌న ు కట్టడి చేస్తారా లేదా యూనివర్సిటీ గొడవలు మాకెందుకని వదిలేస్తారా అని ప్రశ్నిస్తున్నాయి.

విక్రమసింఘేకు బెయిల్

కొలంబో: శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘేకు బెయిల్ మంజూరైంది. ఈ మేరకు కొలంబో మెజిస్ట్రేట్ కోర్టు ఆదేశాలిచ్చింది. పోలీసులు భారీ బందోబస్తుతో విక్రమసింఘెను మంగళవారం కోర్టులో హాజరు పరిచారు.

ఆయన ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా బెయిల్ ఇస్తున్నట్లు కోర్టు పేర్కొంది. అయితే విక్రమసింఘె మద్దతుదారులు భారీ సంఖ్యలో కోర్టు వద్దకు చేరుకొన్నారు. దీంతో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. నిధులను దుర్వినియోగించినట్లు విక్రమసింఘెపై ఆరోపణలు ఉన్నాయి. ఆయనను ఈనెల 22న అరెస్టయ్యారు.

4న మంత్రివర్గ సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానంద్ ఆదేశాలిచ్చారు. రాజధాని ప్రాంతంలో వివిధ సంస్థల ఏర్పాటుకు సంబంధించి భూ కేటాయింపులతో పాటు, పాలనాపరమైన అంశాలకు సంబంధించి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సెప్టెంబరులో నిర్వహించే అవకాశముప్పందున, సభలో ప్రవేశపెట్టాల్సిన బిల్లులు, వివిధ శాఖలకు సంబంధించి తీసుకురావల్సిన చట్ట సవరణలు కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

రేపటి నుంచి డీఎస్సీ ధ్రువీకరణ పత్రాల పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. డీఎస్సీ ప్రతిభా జాబితాలో ఉన్న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 28వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుంది. తొలుత ఈ ప్రక్రియ ఈ నెల 25 నుంచి ప్రారంభించాల్సి ఉంది. వివిధ కారణాలతో ఈ ప్రక్రియ ఆలస్యమైంది. దీంతో 25వ తేదీ సోమవారం రాత్రి నుంచి అభ్యర్థులకు కాల్‌లెటర్లు పంపించేందుకు విద్యా శాఖ ఏర్పాట్లు చేసింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి డీఎస్సీ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు కాల్‌లెటర్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. జోన్ ఆఫ్ కన్సిడరేషన్‌లోకి వచ్చిన అభ్యర్థులందరికీ వారు దరఖాస్తు చేసిన అన్ని పోస్టులకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన సంబంధిత జిల్లాల్లోనే ఆ రోజు నుంచి ప్రారంభమవుతుంది. డీఎస్సీ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు తమ వ్యక్తిగత లాగిన్ ద్వారా కాల్ లెటర్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి. మెగా డీఎస్సీలో చాలా మంది అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇందులో అభ్యర్థులు తొలి ప్రాధాన్యం కింద ఇచ్చిన పోస్టుకు ఎంపిక చేసి, మిగిలిన పోస్టులను ఆ తర్వాత ప్రతిభా జాబితాలో ఉన్న వారికి కేటాయించాలని విద్యాశాఖ భావిస్తోంది. ఇందుకు సంబంధించి అభ్యర్థుల పోస్టుల ఆప్షన్లు మార్చుకునే అవకాశం లేదని డీఎస్సీ కన్వీనర్ తాజాగా స్పష్టం చేసిన విషయం విదితమే. డీఎస్సీ పరీక్షలకు ముందే దరఖాస్తు సమయంలోనే అభ్యర్థులు పోస్టులు ఎంపిక చేసుకున్నారని, ఇక వాటిని మార్చే అవకాశం ఉండబోదని తెలిపారు. ప్రతిభా జాబితా ప్రకటించే ముందు వరకు టెట్ మార్కుల సవరణ కోసం విద్యాశాఖ నాలుగుసార్లు అవకాశం కల్పించింది. డీఎస్సీలో అభ్యర్థుల తొలి ప్రాధాన్యానికే ప్రాముఖ్యత ఇస్తామని కన్వీనర్ తెలిపారు. 16,347ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ పరీక్షలను ప్రభుత్వం నిర్వహించిన విషయం విదితమే. అనేక న్యాయపరమైన అంశాలను ఎదుర్కొన్న ప్రభుత్వం పారదర్శకంగా ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ పూర్తి చేసేందుకు సిద్ధమయింది.

ఆర్థిక అంతరాలు తొలగాలంటే

సహకార వ్యవస్థ బలోపేతమే మార్గం

వీసీబీ బ్యాంకు చైర్మన్ జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-తెనాలి: సమాజంలో ఆర్థిక అంతరాలను తగ్గించాలంటే సహకార వ్యవస్థ బలోపేతమే పరిష్కార మార్గమని ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ జె.వి. సత్యనారాయణమూర్తి అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలోని బ్యాంక్ స్ట్రీట్‌లో బ్యాంకు 57వ నూతన శాఖను ఈ నెల 28న ప్రారంభించనున్న సందర్భంగా మంగళవారం బ్యాంకు ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక అవసరాలకు సహకార అర్బన్ బ్యాంకులు బాసటగా నిలుస్తున్నాయన్నారు. విశాఖ నగరంలో 1916 ఫిబ్రవరి 5న కార్యకలాపాలు ప్రారంభించిన ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ నేడు తెలుగు రాష్ట్రాల్లో 56 శాఖల ద్వారా బహుళ రాష్ట్రాల అర్బన్ బ్యాంకుగా ప్రజలకు సేవలు అందిస్తోందన్నారు. డిపాజిటర్లను సభ్యులుగా చేర్చడం ద్వారా బ్యాంకు పాలకవర్గం నిర్ణయాల్లో భాగస్వాములను చేస్తూ నూతన ఒరవడితో ముందుకు సాగుతుందని తెలిపారు. 2025 జులై నాటికి డిపాజిట్లు రూ.4,493 కోట్లు, రుణాలు రూ.3,511 కోట్లు కలిపి మొత్తం రూ.8,004 కోట్ల ఆర్థిక కార్యకలాపాలతో దేశంలో 1,472 అర్బన్ సహకార బ్యాంకుల్లో గుజరాత్, మహారాష్ట్ర మినహా అతిపెద్ద సహకార బ్యాంకుగా ఆవిర్భవించిందన్నారు. అర్బన్ బ్యాంకుల పని తీరుపై భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) ఈ ఏడాది ఏప్రిల్ 23న విడుదల చేసిన నివేదిక ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరానికి దేశంలో మొదటి 15 బ్యాంకుల్లో విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు ఒకటిగా నిలిచిందన్నారు. 1,14,265 మంది సభ్యులు సమకూర్చిన రూ.403 కోట్ల మూలధనంతో దేశంలోనే అర్బన్ బ్యాంకులలో మూడవ స్థానంలో ఉందన్నారు. బ్యాంకునకు రూ.470.62 కోట్ల రిజర్వు నిధులు ఉన్నట్టు చెప్పారు. ఈ ఏడాది మార్చి నాటికి రూ.71.77 కోట్ల నికర లాభం ఆర్జించగా, సభ్యులకు 12 శాతం చొప్పున రూ.43.25 కోట్లను డివిడెండ్ రూపంలో చెల్లించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 15 సొంత భవనాలు కలిగిన విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ 2025-26 ఆర్థిక సంవత్సరంలో విశాఖలోని గాజువాక, గోపాలపట్నం, విజయవాడలో నూతన సొంత భవనాల నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. 57వ బ్రాంచ్‌గా తెనాలి శాఖను ప్రారంభించుకోవడంతో పాటు త్వరలో అమలాపురం, హైదరాబాద్, విశాఖపట్నంలో నూతన శాఖలను ప్రారంభించడం ద్వారా బ్రాంచ్‌ల సంఖ్య 60కి చేర్చాలనే లక్ష్యం పెట్టుకున్నట్లు జేవీ సత్యనారాయణమూర్తి తెలిపారు. తెనాలి శాఖ ద్వారా వచ్చే ఐదేళ్లలో రూ.100 కోట్ల ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తామన్నారు. భవిష్యత్‌లో తెనాలి ప్రాంత ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదల, ఈ ప్రాంత అభివృద్ధిలో బ్యాంకు తన వంతు పాత్ర నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు, ప్రొఫెసర్ నన్నపనేని అంజయ్య, చిన్నం కోటేశ్వరరావు, చుక్కపల్లి రామారావు, పి.వి.మల్లికార్జునరావు, డిప్యూటీ సీఈవో ఎం.వి.గణేష్ కుమార్, విజయవాడ రూరల్ మేనేజర్ ఎన్.ఎస్.ఆర్.మూర్తి, తెనాలి బ్రాంచ్ మేనేజర్ జి.ఎల్.వి. ప్రకాశరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు తెనాలిలో ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ప్రారంభం

తెనాలిలో ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ 57వ బ్రాంచ్ మొట్టుపల్లి వారి వీధి, కొత్తపేటలో 28వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం 10.30 గంటలకు తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సభా కార్యక్రమం నిర్వహిస్తామని, చైర్మన్ సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహిస్తారని వివరించారు. సభను ఆర్‌బీఐ ఏపీ జనరల్ మేనేజర్ ఆర్.కె.మహాన ప్రారంభిస్తారని చెప్పారు.

దివ్యాంగులపై మానవత్వం ఏదీ?: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు ప్రభుత్వానికి దివ్యాంగులపై మానవత్వం లేదని, కనికరం లేకుండా వారి పొట్ట కొట్టాలని చూడటం దారుణమని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు షర్మిల ధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అనర్హత పేరుతో 20 ఏళ్ల నుంచి పెన్షన్‌పై బతుకుతున్న వారికి సైతం రద్దు చేయాలని చూడటం సిగ్గుచేటని పేర్కొన్నారు. వికలాంగుల జీవితాలతో రాజకీయం తగదని, అయితే బోగస్ పెన్షన్లు గుర్తించడం మంచిదేనని తెలిపారు. దొంగ సర్టిఫికెట్లు తీసుకున్న వాళ్లపై, ఇచ్చిన వైద్యులపై కఠిన చర్యలు ఉండాల్సిందేనని అన్నారు. నోటీసులు ఇచ్చిన లక్షా 20 వేల మందిలో అర్హులే ఎక్కువ మంది ఉన్నారని తెలుస్తోందని, అనర్హులుగా గుర్తించిన జాబితాపై మళ్లీ పరిశీలన చేపట్టాలన్నారు. అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలని, వెంటనే వారి పెన్షన్లు పునరుద్ధరించాలని చంద్రబాబును ఆమె డిమాండ్ చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయిని శ్రీదేవికి లోకేశ్ అభినందన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయన మాదాబత్తుల తిరుమల శ్రీదేవికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయినిగా జాతీయ అవార్డుకు ఎంపిక కావడం రాష్ట్రానికే గర్వకారణమని బుధవారం 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. విశాఖపట్నం జిల్లా భీముని పట్నం పండిట్ నెహ్రూ మునిసిపల్ హైస్కూలు ప్రధానోపాధ్యాయులుగా శ్రీదేవి పని చేస్తోంది. 'కమ్ టు లెర్న్-గోటు సర్వే ద నేషన్' నినాదంతో వినూత్న బోధనా పద్ధతిలో విద్యార్థులను ఆమె తీర్చిదిద్దుతూ ఉపాధ్యాయ లోకానికి ఆమె స్ఫూర్తినిస్తోంది.

వాన్‌పిక్‌కు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో సీబీఐ ఛార్జ్‌షీట్ నుంచి తమ సంస్థ పేరును తొలగించాలంటూ వాన్‌పిక్ దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. గతంలో వాన్‌పిక్ పేరును సీబీఐ తన ఛార్జ్‌షీట్‌లో చేర్చింది. ప్రస్తుతం ఈ కేసు నాంపల్లి సీబీఐ కోర్టులో విచారణలో ఉంది. అయితే 2022 జులైలో వాన్‌పిక్ ప్రాజెక్ట్ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులను సుప్రీం కోర్టులో సీబీఐ సవాల్ చేసింది. తమ వాదనలను పరిగణనలోకి తీసుకోకుండా వాన్‌పిక్ ప్రాజెక్ట్ పిటిషన్‌ను అనుమతించారని వాదించింది. సీబీఐ వాదనలను పరిగణనలోకి తీసుకున్న అత్యున్నత న్యాయస్థానం మరోసారి పిటిషన్‌ను విచారించాలని హైకోర్టును ఆదేశించింది. ఈ నేపథ్యంలో మరోసారి వాన్‌పిక్ ప్రాజెక్టుపై వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం, పిటిషన్‌ను కొట్టివేసింది.

విశ్రాంత ఎస్ఈసీలకు స్టేట్ గెస్ట్ హోదా

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశ్రాంత రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల(ఎస్ఈసీ)కు కీలక సౌకర్యాన్ని కల్పించింది. ఇకపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పదవిని నిర్వర్తించిన వారందరికీ స్టేట్ గెస్ట్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ వేడుకలు, కార్యక్రమాల్లో మాజీ ఎన్నికల కమిషనర్లకు ప్రోటోకాల్ సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని శాఖలు, హెచ్ఓడీలు, జిల్లా కలెక్టర్లు, పోలీస్ సూపరింటెండెంట్లు తదితర అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పేదలకు ఇళ్ల నిర్మాణంపై మంత్రివర్గ ఉపసంఘం

విశాలాంధ్ర-సచివాలయం: రాష్ట్రంలో అర్హులకు ఇళ్లు కట్టిచ్చే విషయమై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పథకం అమలు పర్యవేక్షణకు కేబినెట్ ఉప సంఘం ఏర్పాటు చేసింది. క్షేత్ర స్థాయిలో సమస్యలు, సవాళ్ల పరిష్కారానికి ఉపసంఘం సభ్యులుగా గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణను నియమించింది. సమస్యలపై నివేదిక ఇవ్వాలని, ఆర్టీజీఎస్ ఆధారంగా లబ్ధిదారుల్ని గుర్తించే విధానంపై అధ్యయనం చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అర్హత కలిగిన కుటుంబాలకు ఇళ్లు కేటాయించే విధానాలపై అధ్యయనం చేయనున్నారు.పట్టణాలు, గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు, గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలపై కోర్టు కేసుల పరిష్కారంపై చర్చించనున్నారు. క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం కోసం సరైన మార్గదర్శకాలు రూపొందించనున్నారు. వీలైనంత త్వరగా అధ్యయన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనున్నారు.

హామీ నెరవేరింది: కొనకళ్ల నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించిందని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏటా మెగా డీఎస్సీ నిర్వహించి యువ ఉపాధ్యాయులతో రాష్ట్ర విద్యారంగాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో 14 నెలలుగా విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలవుతున్నాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం మెగా డీఎస్సీ హామీ ఇచ్చింది కానీ ఒక్క పోస్టు భర్తీ చేయలేదని, విద్యారంగాన్ని నాశనం చేసిందని విమర్శించారు. 24 కేసులు వేసినా మెగా డీఎస్సీని ఆపలేకపోయిందన్నారు.

దివ్యాంగుల పింఛన్‌పై వైసీపీ తప్పుడు ప్రచారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దివ్యాంగుల పింఛన్‌పై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ గడుపూటి నారాయణస్వామి విమర్శించారు. టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమంపై ప్రభుత్వ నిర్ణయాలను దురుద్దేశంతో వైసీపీ వక్రీకరిస్తోందని ఆరోపించారు. ఇటీవల వైసీపీ, దాని అనుకూల మీడియా అసత్య ప్రచారంతో దివ్యాంగులను అయోమయంలోకి నెట్టి కపట ప్రేమ చూపిస్తున్నదన్నారు. తన ఐదేళ్ల పాలనలో దివ్యాంగుల కోసం ఏమేమి చేశారో మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి చెప్పాలంటూ సవాల్ విసిరారు. రాబోయే నాలుగేళ్లలో దివ్యాంగుల కార్పొరేషన్ ద్వారా మరిన్ని పథకాలు, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు నారాయణ స్వామి వెల్లడించారు.

ప్రాజెక్టులు పూర్తిచేయకపోవడం వల్లే

రాయలసీమకు నీటి కరువు

ఆలోచనాపరుల వేదిక నాయకులు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): రాయలసీమ ప్రాంతానికి నీటి లభ్యతకు కొదవ లేదని, కానీ వచ్చిన నీటిని సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం వలన కరువు మరింత పెరిగిందని ఆలోచనాపరుల వేదిక నాయకులు స్పష్టం చేశారు. శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణా నదీ జలాలపై ఆధారపడి నిర్మించిన, నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల స్థితిగతులపై ఆగస్టు 4 నుంచి 6 వరకు క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసిన విషయాలను మంగళవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు వివరించారు. ఈ సందర్భంగా మాజీ ఐపీఎస్, వేదిక నాయకులు ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం-బనకచెర్ల ఎత్తిపోతల పథకం, గత ప్రభుత్వం చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకం వల్ల కరవు పీడిత రాయలసీమకు ఏ మాత్రం ప్రయోజనం లేదని, వాటిని విరమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవలం జలాశయాల్లో నీటిని నింపడం ద్వారా ప్రయోజనం ఉండదని, ఆయా ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టు పరిధిలోని చివరి ఎకరా భూమి వరకు నీటిని అందించినప్పుడే పూర్తి స్థాయిలో ప్రయోజనాలు ఒనగూడుతాయని తెలిపారు. రాయలసీమ ప్రాంతంలోని ప్రాజెక్టులకు రూ.10... 15 వేల రూపాయలు ఖర్చు చేస్తే పది లక్షల ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు.

నీటి ప్రాజెక్టుల అధ్యయన, విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గోదావరి-కావేరి నదుల అనుసంధాన పథకాన్ని ఇచ్చంపల్లి నుంచి చేపట్టాలన్న జాతీయ నదుల అనుసంధాన టాస్క్‌ఫోర్స్ కమిటీ ప్రతిపాదనను తాజాగా హైదరాబాదులో జరిగిన సమావేశంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తిరస్కరించి, పోలవరం-సోమశిల-కావేరి ఆనకట్టు అనుసంధాన పథకంగా చేపట్టాలని ప్రతిపాదించడం సమర్థనీయమని అన్నారు. గోదావరి నీటిని పోలవరం జలాశయం నుంచి చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రతిపాదిత ఆయకట్టుకు సాగు నీరు అందించాలని తెలిపారు. అలాగే నాగార్జున్ సాగర్ ఎడమ, కుడి కాలువల ఆయకట్టు స్థిరీకరణ, వెలిగొండ ప్రాజెక్టు కింద ప్రకాశం జిల్లాలో నూతన ఆయకట్టుకు, సోమశిల, కండలేరు రిజర్వాయర్ల కింది ఆయకట్టుకు అందించాలని సూచించారు. తద్వారా ఆదా అయ్యే కృష్ణా నదీ జలాలను శ్రీశైలం రిజర్వాయరు నుంచి రాయలసీమ ప్రాజెక్టులకు గ్రావిటీ మీద అందజేయాలని విజ్ఞప్తి చేశారు. గంగా-కావేరి నదుల అనుసంధాన పథకంలో భాగంగా గంగా-మహానది, మహానది-గోదావరి (పోలవరం) అనుసంధానం చేయకుండా గోదావరి-కావేరి అనుసంధాన పథకాన్ని ఇచ్చంపల్లి నుంచి చేపడితే బహుళార్థ సాధక ప్రాజెక్టు అయిన పోలవరానికి నికర జాలాల లభ్యత బాగా తగ్గి ప్రమాదం ముంచుకొస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు రెండు నెలలుగా శ్రీశైలం జలాశయం నిండుగా ఉన్నా వందలాది టీఎంసీలు కిందికి ప్రవహిస్తున్నా, రాయలసీమ ప్రాంతంలోని రిజర్వాయర్లను ఎందుకు నింపలేకపోయారో సీఎం చంద్రబాబు ఆలోచించాలన్నారు. శ్రీశైలం నుంచి రిజర్వాయర్లకు నీటిని తరలించినా ఆయా ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేయకపోవడం, ప్రధాన కాలువలు, పంట కాలువల వ్యవస్థను నిర్మించకపోవడం, వినియోగంలో ఉన్న ప్రాజెక్టుల కింద మరమ్మతులు చేయకపోవడంతో నీటిని వాడుకోలేని దౌర్భాగ్య పరిస్థితి ఉందని విమర్శించారు.

రైతు సేవా సంస్థ అధ్యక్షుడు అక్కినేని భవానీ ప్రసాద్ మాట్లాడుతూ గడచిన రెండు నెలల వ్యవధిలో దాదాపు 450 టీఎంసీలు ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి వెళ్లాయని, వైకుంఠాపురం రిజర్వాయరును 20 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ రిజర్వాయరు నిర్మాణానికి సత్వరం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జొన్నలగడ్డ రామారావు పాల్గొన్నారు.

ఆర్టీసీలో పదోన్నతులకు సీఎం గ్రీన్ సిగ్నల్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీలో పదోన్నతులకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ ఆర్టీసీ ఉద్యోగులకు 2019లో గత ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వంలో విలీనం వరకు వివిధ కారణాలతో పదోన్నతులకు అనుమతుల ఇవ్వలేదన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీ అసిస్టెంట్ మెకానిక్ నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వరకు ఇవ్వాల్సిన పదోన్నతులకు సంబంధించి ఆర్టీసీలో ప్రభుత్వ గుర్తింపు సంఘం అయిన ఎంప్లాయీస్ యూనియన్ నిరంతరం చేసిన కృషితో ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు స్పందించి ప్రభుత్వ అనుమతులకు దస్త్రం పంపించారన్నారు. ఈ నెల 15న స్త్రీశక్తి పథకం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు... విజయవాడ బస్సు స్టేషన్‌కు వచ్చినప్పుడు ఈయూ రాష్ట్ర కమిటీ పదోన్నతులపై లేఖ ఇవ్వడంతో పాటు ఈ నెల 20న ఉద్యోగ సంఘాలతో జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉన్నతాధికారులకు లేఖ ఇచ్చామని వివరించారు. సీఎం చంద్రబాబు పదోన్నతులపై గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆర్టీసీలో ఆరేళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న సుమారు 3 వేల మందికి పదోన్నతుల పొందే అవకాశం లభిస్తుందని తెలిపారు.

ఈయూ హర్షం

మద్యం నిందితులకు షాక్

మళ్లీ రిమాండ్ పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితులకు మళ్లీ రిమాండ్ విధించారు. ఈ కేసులో 12 మంది నిందితులకు సెప్టెంబరు 3వ తేదీ వరకు ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగిస్తూ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో 12 మంది నిందితులను వివిధ జైళ్లకు పోలీసులు తరలించారు. ఇదే కేసులో వైసీపీ ఎంపీ పి.మిథున్ రెడ్డిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు పోలీసులు తరలించారు. మిగిలిన 9 మంది నిందితులను విజయవాడకు, మరో ఇద్దరు నిందితులను గుంటూరు జైలుకు పోలీసులు పంపారు. ఈ కేసులో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు రాజ్ కసిరెడ్డి తనపై నమోదయిన కేసును ఖండించారు. కస్టోడియల్ విచారణ పేరుతో సిట్ అధికారులు తనను అరెస్టు చేశారని, మద్యం కేసులో తన పాత్ర ఎక్కడా లేదని పేర్కొన్నారు. తన తప్పు ఎక్కడా లేనప్పటికీ... ఆధారాలు సృష్టించారని రాజ్ కసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా ఫామ్‌హౌస్‌లో దొరికిన రూ.11 కోట్లు తనవి కావని అన్నారు. కాగా, తాను నడుం నొప్పితో ఇబ్బంది పడుతున్నానని, జైలులో సరైన వైద్యం అందడం లేదని ఏసీబీ న్యాయమూర్తి ఎదుట చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. నొప్పికి పెయిన్ కిల్లర్లు వాడమంటున్నారని, వాడితే సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయని పేర్కొన్నారు.

అధికారులు సృజనాత్మకతతో పని చేయాలి: మంత్రి సత్యకుమార్

విశాలాంధ్ర - సచివాలయం: వైద్యారోగ్య సిబ్బంది వినూత్నంగా ఆలోచించి ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేయాలని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజాప్రతినిధులు, సామాన్యులు పలు ప్రజాసమస్యల్ని తన దృష్టికి తెచ్చినప్పుడు వాటిని సంబంధిత అధికారులు శీఘ్రమే పరిశీలించి తగు సమాచారాన్ని అందజేయాలని, ఈ విషయంలో ఆలస్యం జరగడంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాసమస్యల్ని పట్టించుకోకపోతే అది ప్రజాస్వామ్య ఉల్లంఘనకిందకు వస్తుందని, ఈ విషయంపై వైద్యులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. ఈ ఏడాది జూన్‌లో వైద్యారోగ్య శాఖ చేపట్టిన సాధారణ బదిలీల తీరు, ఫలితాలపై మంత్రి విభాగాధిపతులతో చర్చించారు. 7,200కు పైగా వైద్యులు, పాలనా సిబ్బందిని బదిలీ చేయగా వారిలో నిర్ణీత గడువులో 99 శాతం మంది కొత్త పోస్టింగ్ ల్లో చేరినట్లు ఉన్నతాధికారులు వివరించారు. నియమాల మేరకు వివాద రహితంగా భారీ స్థాయిలో సాధారణ బదిలీల ప్రక్రియను విజయవంతంగా ముగించినందుకు విభాగాధిపతులను, అధికారులను మంత్రి అభినందించారు. గతానికి భిన్నంగా వివాద రహితంగా బదిలీలు జరిగాయనడానికి 99 శాతం మంది ఉద్యోగులు బదిలీ ఆదేశాలను ఆమోదించడం నిదర్శనమని మంత్రి అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, విభాగాధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర సచివాలయంలో

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

విశాలాంధ్ర-సచివాలయం: వినాయక చవితిని పురస్కరించుకుని మట్టి గణపతిని పూజిద్దాం-పర్యావరణాన్ని కాపాడుదాం... పర్యావరణ భద్రత-మనందరి బాధ్యత అంటూ రాష్ట్ర సచివాలయంలో మట్టి వినాయక విగ్రహాలను పెద్ద ఎత్తున పంపిణీ చేశారు. రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తరపున వారి పేషీ అధికారులు, సిబ్బంది మట్టితో తయారు చేసిన అంకుర గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ అంకుర గణపతి ప్రతిమను పూజ అనంతరం నీటితో తడిపి నానబెడితే అందులో నుంచి మొక్క వస్తుందని తద్వారా పచ్చదనం పరిఢవిల్లుతుందని అంటున్నారు. అలాగే రాష్ట్ర కాలుష్య నివారణ మండలి అధ్వర్యంలో రాష్ట్ర సచివాలయ ఉద్యోగులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహిస్తూ తద్వారా ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలనే లక్ష్యంతో ఈ విగ్రహాలను పంపిణీ చేశారు. రాష్ట్ర కాలుష్య నివారణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్ఎస్ఎస్ అధికారి ఎం.సుధాకర్, కాలుష్య నివారణ మండలి పర్యావరణ ఇంజనీరు మెహ్మద్ నజీనా బేగం, పర్యావరణ మానవ సమాజ భద్రత బాధ్యత ఫౌండేషన్ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై చర్చ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అంగన్‌వాడీల సమస్యల్ని పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్లు డిమాండ్ చేశాయి. అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం కోసం ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్లకు చెందిన ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్టీయూ అనుబంధిత మూడు ట్రేడ్ యూనియన్ల నాయకులతో కలిసి వివిధ రకాలైన అంగన్వాడీ వర్కర్స్, మినీవర్కర్స్ అండ్ హెల్పర్ల సమస్యల్ని సంబంధిత ప్రాజెక్టు డైరెక్టరుతో చర్చించారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.లలిత, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ప్రేమతోపాటు నాయకులు ప్రభావతి, సంపూర్ణ, శారమ్మ, వాణిశ్రీ చౌడేశ్వరి, సరళ, జులేఖ, భూషణకుమారి, మాధవి, నాగరాజమ్మ, వెంకటలక్ష్మీ, కృపారాణి, అంగన్‌వాడీ అసోసియేషన్ నుంచి హాజరయ్యారు. సీఐటీయూ నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరామమ్మ, సుప్రజ, లక్ష్మీదేవి, ఐఎఫ్టీయూ అనుబంధ సంఘాల నుంచి జ్యోతి భారతితోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి మూడు సంఘాలకు సంబంధించిన ఆయా జిల్లాల నాయకులు 30మంది హాజరయ్యారు. ప్రతి ఒక్క అంగన్‌వాడీ వర్కర్‌గానీ, హెల్పర్‌గానీ వారికి రావాలిసిన సరుకులు తీసుకున్నాకనే బాల సంజీవిని యాప్‌లో రశీదు జమ చేసేందుకుగాను, ఇప్పటివరకు అన్ని డివిజనల్ హెడ్ క్వార్టర్ల ప్రాజెక్టుకు ఇండక్షన్ స్టవ్‌లు ఇచ్చారని, వాటిని ఉపయోగించి అంగన్‌వాడీ కేంద్రంలో వంట చేయడం ప్రారంభించేలా చర్యలకు అధికారి హామీ ఇచ్చారని యూనియన్ నేతలు తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి యజమానులతో ఇబ్బంది లేకుండా విద్యుత్‌శాఖ వారితో మాట్లాడి ప్రత్యేక విద్యుత్ రీడింగ్ మీటర్లు ఏర్పాటు చేయాలన్నారు. త్వరలో సీఎం చంద్రబాబు అనుమతి తీసుకుని, వేతనాలకు సంబంధించిన విషయం మాట్లాడతామని తమకు హామీ ఇచ్చినట్లు వివరించారు.

MUNICIPAL CORPORATION KADAPA

'ap'e-procurement Tender Notice. 839369/ATO/25-26/MCK dt.26.08.2025

S.No.	Description	No.of Works	Esti. Rs. in lakhs
01.	15th FCG	01	60.00
02.	General Funds	05	80.00
	TOTAL:	06	140.00

	Bid Document Download Start Date	Bid Document Download End Date	Bid Submission Closing Date & Time
01	25/08/2025 03.00 PM	08/09/2025 03.00 PM	08/09/2025 03.30 PM
02	28/07/2025 03.00 PM	11/09/2025 03.00 PM	11/09/2025 03.30 PM
02	25/07/2025 03.00 PM	28/08/2025 03.00 PM	28/08/2025 03.30 PM

Further details can be seen at 'e' Procurement market place in www.apeprocurement.gov.in officer inviting bid, Commissioner, Municipal Corporation of Kadapa, A.P

Commissioner,
Kadapa Municipal Corporation,
YSR District.

సంపాదకీయం

ధన్కర్ విషయంలో అంతా రహస్యమే

ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్కర్ రాజీనామా చేసి అయిదు వారాలు అయింది. కానీ అప్పటి నుంచి ఆయన పూర్తిగా తెరమరుగు అయిపోయారు. ఆయన ఎక్కడ ఉన్నారో, ఎలా ఉన్నారో తెలియదు. ఆయనగానీ, ప్రభుత్వంగానీ ఏ వివరమూ వెల్లడించడం లేదు. అనారోగ్య కారణాలవల్ల ఆయన రాజీనామా చేశారంటున్నారు. కానీ ఈ వాదనను నమ్మే వారు ఎవరూ కనిపించడం లేదు. ఎందుకంటే ఆయన రాజీనామా చేసిన రోజున రాజ్యసభలో చాలా హుషారుగానే ఉన్నారు. సాయంత్రం దాకా రాజ్యసభలోనే ఉన్నారు. ఆయన రాజీనామా ఎందుకు చేశారో ఇప్పటికీ అధికారిక సమాచారం ఏమీ లేదు. హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ శర్మ ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన తరవాత ఆయనను పదవి నుంచి తొలగించాలని మోదీ ప్రభుత్వం భావించింది. ఈ లోగా వర్మను తొలగించడంకోసం ప్రతిపక్షాలు ఇచ్చిన ఇంపీచ్‌మెంట్ నోటీసును జగదీప్ ధన్కర్ ఆమోదించారు. ఇదే మోదీ ప్రభుత్వం ధన్కర్ చేత బలవంతంగా రాజీనామా చేయించడానికి కారణం అంటున్నారు. యశ్వంత్ వర్మ ఇంపీచ్మెంట్‌పై మొదట లోక్‌సభలో చర్చ ప్రారంభించి తాము అవినీతికి ఎంత వ్యతిరేకులమో చాటి చెప్పుకోవడానికి మోదీ ప్రభుత్వం చేసిన ప్రయత్నానికి రాజ్యసభలో ఆ తీర్మానం ముందు అనుమతించడం ప్రభుత్వ ఉద్దేశానికి గండి కొట్టినట్టు అయింది. ఇద్దరు మంత్రులు “మీరు చేసిన పని మోదీకి నచ్చలేదు” అని సమాచారం అందించారంటున్నారు. కానీ తాను సభ నియమాల ప్రకారమే ప్రవర్తిస్తున్నాను కదా అన్నది ధన్కర్ వాదన. మొత్తం మీద జులై 21వ తేదీకల్లా ధన్కర్ రాజీనామా చేసినట్టు తెలిసిపోయింది. అయితే ఇందులోనూ ఓ మతలబు ఉంది. ఆయన రాష్ట్రపతి ముర్మును కలుసుకుని రాజీనామా లేఖ అందించారని మొదట సమాచారం వచ్చింది. ఈ విషయమై సమాచార హక్కు చట్టం కింద పెట్టుకున్న దరఖాస్తుకు వచ్చిన సమాధానం ప్రకారం ధన్కర్ స్వయంగా రాష్ట్రపతిని కలుసుకున్న దాఖలాలే లేవు. అంటే ఆయన రాజీనామా రాష్ట్రపతికి ఎలా చేరిందో, ఆమె ఎలా ఆమోదించారో ఇప్పటికీ రహస్యమే. ఈ వ్యవహారాలన్నింటినీ గోప్యంగా ఉంచాలన్న మోదీ ప్రభుత్వ ప్రయత్నం కాస్తా అడ్డం తిరిగింది. ధన్కర్ చేత బలవంతంగా రాజీనామా చేయించారన్న అనుమానాలు బయట పడ్డాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ కూడా వాస్తవం బయటపడడానికి ఉపకరించలేదు. అమిత్ షా అన్ని ప్రశ్నలకు దాటవేత సమాధానాలే ఇచ్చారు. న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంపీచ్మెంటు తీర్మానాన్ని మొదట లోక్‌సభలో చర్చించాలన్న ప్రభుత్వ ఆలోచనలో తాము అవినీతిని సహించబోమని నిరూపించుకోవడం ఒక లక్ష్యం మాత్రమే. ప్రభుత్వం ఉద్దేశం ఈ విషయంలో చాలా లోతైంది. లోక్‌సభలో చర్చ ద్వారా న్యాయ మూర్తులను నియమించే కొలీజియం వ్యవస్థ ఎంత లోపభూయిష్టం అయిందో చాటి చెప్పడం ప్రభుత్వ అసలు ఉద్దేశం. బీజేపీ ప్రభుత్వ ఉద్దేశం న్యాయమూర్తుల నియామకం తమ చేతుల్లో ఉండేట్టు చేసుకోవడమే. అంటే జాతీయ జ్యుడీషియల్ కమిషన్ లాంటిదాన్ని పునరుద్ధరించడమే అసలు ఉద్దేశం. జ్యుడీషియల్ కమిషన్ బిల్లును 2014లో మోదీ ప్రభుత్వం ప్రతిపాదించింది. కానీ 2015లో ఈ బిల్లు చెల్లదని సుప్రీంకోర్టు కొట్టేసింది. అక్కడి నుంచి న్యాయవ్యవస్థపై ఆధిపత్యం సంపాదించడానికి కిరణ్ రిజిజు న్యాయశాఖ మంత్రిగా ఉన్నప్పుడు చేయని ప్రయత్నం లేదు. జ్యుడీషియల్ కమిషన్ కనక అస్తిత్వంలోకి వస్తే న్యాయమూర్తుల నియామకంపై ప్రభుత్వానికే పూర్తి పెత్తనం ఉంటుంది. న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీయడం మీదే మోదీ ప్రభుత్వం గురి ఉంది. ధన్కర్ బెంగాల్ గవర్నర్‌గా ఉన్నప్పుడూ, రాజ్యసభ అధ్యక్షుడిగా వ్యవహరించినప్పుడు మోదీ ప్రభుత్వానికి అనుకూలంగానే వ్యవహరించి తన విశ్వాసాన్ని నిరూపించుకున్నారు. అయితే యశ్వంత్ వర్మను ఇంపీచ్ చేయడానికి ప్రతిపక్షాలు ప్రతిపాదించిన తీర్మానాన్ని లోక్‌సభలో ఈ అంశం చర్చకు వచ్చేదాకా నిలిపి ఉంచడానికి అంగీకరించలేదు. అనారోగ్య కారణాలవల్ల ఆయన రాజీనామా చేశారని ఎవరూ నమ్మడం లేదు కానీ అనేక వ్యాఖ్యానాలు వెలువడుతూనే ఉన్నాయి.

రాజ్యసభలో యశ్వంత వర్మ ఇంపీచ్మెంటు తీర్మానం లోక్‌సభకన్నా ముందు ఆమోదించకూడదన్న మోదీ నిర్దేశాన్ని ధన్కర్ అంగీకరించక పోవడమే కాదు ఆయన ప్రతిపక్షాల వేపు మొగ్గుతున్నారన్న అభిప్రాయం ప్రభుత్వానికి కలిగింది. అధికార మర్యాదల ప్రకారం ఉపరాష్ట్రపతి రెండవ స్థానంలో ఉంటారు. ప్రధానమంత్రి మూడవ స్థానంలో ఉంటారు. కానీ మోదీ హయాంలో ఇలాంటి మర్యాదలకు చోటే లేదు. ధన్కర్‌ను గద్దె దించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్న విషయం ధన్కర్‌కు తెలిసిపోయింది. విధి లేక ఆయన రాజీనామా చేయవలసి వచ్చింది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మన దేశానికి వచ్చినప్పుడు ఆయనను కలుసుకోవడానికి ధన్కర్ ఆసక్తి కనబరిచారు. కానీ ప్రభుత్వం సమ్మతించలేదు. ఆయన విదేశీ యాత్రలకు కూడా మోదీ ప్రభుత్వం అడ్డు తగిలింది. ఇదంతా చూస్తూ ఉంటే పార్లమెంట్ ఉభయసభలను తమ ఇష్టానుసారం నిర్వహించేట్టు చేయడానికి ప్రభుత్వం ఒత్తిడి తెస్తోందని అర్థం అవుతూనే ఉంది. ఉభయ సభల అధిపతులు తమ నిర్దేశాల ప్రకారం నడుచుకోవాలని మోదీ సర్కారు అనేక సంకేతాలూ ఇస్తూనే ఉంది. సభాపతులకు తాము నిర్వహించే సభలను స్వతంత్రంగా, రాజ్యాంగబద్ధంగా నిర్వహించడం మోదీ ప్రభుత్వానికి రుచించడం లేదు. 2019లో మోదీ మరింత ఎక్కువ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తరవాత సభాపతులను నిర్దేశించే ధోరణి పెరిగింది. 2023లో ప్రతిపక్షాలకు చెందిన 146 మందిని ఉభయసభల నుంచి సస్పెండ్ చేయడం దీనికి ప్రబలమైన నిదర్శనం. మోదీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరవాత ఒక్క బిల్లును కూడా సెలెక్ట్ కమిటీకి పంపలేదు. జులై 21న ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసినప్పటి నుంచీ ధన్కడ్ జాడే తెలియడం లేదు. ఆయన బాగోగుల గురించి మాట్లాడడం, ఆయన వ్యక్తిగత జీవితంలోకి తొంగి చూడడం కాదు. ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తి రాజీనామా చేసిన తరవాత ఆయన ఎలా ఉన్నారు, ఏం చేస్తున్నారు అన్న అంశం మీద సహజంగానే ప్రజలకు ఆసక్తి ఉంటుంది. కానీ మోదీ ప్రభుత్వం ధన్కర్ వ్యవహారంపై ఇసుమంత సమాచారం కూడా ఇవ్వడం లేదు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు రాజీనామా చేసినప్పటికీ వారి ఆరోగ్యం గురించి ప్రభుత్వం వివరాలు అందించడం ప్రజాస్వామ్య దేశాల సంప్రదాయం. కానీ మోదీ హయాంలో అన్నీ దాపరికమే. దాపరికం లేకుండా నడుచుకోవడం ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనానికి కొలమానం. దాచిపెట్టడం అంటే ప్రజల నుంచి నిజం దాచడమే కాదు, వారి హక్కులను హరించడమే. ఏమైనా ధన్కర్ జాడ తెలియాల్సిందే.

ప్రజావాణి సురవరం

భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకులలో సురవరం సుధాకరరెడ్డి (ఎస్ఎస్ఆర్) ఒకరు. దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన గొప్ప నాయకుడు ఆయన. ప్రజా క్షేత్రంలో ఆయన సేవలు మరువలేనివి. జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి నేతగా ఎదిగిననేత, పీడిత వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడిన పేదల పక్షపాతి సురవరం. మంచి చదవరి. నిజానికి పుస్తకాల పురుగు. అనారోగ్య కారణంగా క్రియశీల రాజకీయాల నుంచి విరమించుకున్న తరువాత ఎక్కువ సమయం పుస్తకపఠనంలోనే గడిపారు. విద్యార్థి దశ నుంచే వామపక్ష రాజకీయాలలో భాగస్వామి ఆయ్యారు. విద్యార్థి దశలోనే పోరాటతత్వం అలవర్చుకున్న ఆయన అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. తరువాత అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)కు జాతియ నాయకులుగా వ్యవహరించారు.

పార్టీలో ఎస్ఎస్ఆర్ పాత్ర

1970వ దశకం ఆరంభం నుంచి కమ్యూనిస్టుపార్టీలో అనేక పదవులను అలకరించారు. ఏఐఎస్ఎఫ్‌లో జిల్లా నాయకుడిగా ఉన్నప్పుడే పార్టీ సభ్యత్వం స్వీకరించిన సురవరం పార్టీ నియమనిబంధనలకు కట్టుబడి పార్టీని బలోపేతం చేశారు. ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శిగా, ఎన్నో ఉద్యమాలకు అంకుర్పాణ చేశారు. అఖిల భారత యువజనసమాఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్నప్పుడు అనేకమంది యువజనులను పార్టీ సభ్యులుగా చేర్చారు. పార్టీలో కొత్తగా చేరిన వారికి కమ్యూనిస్టు విలవలును నేర్పిన ఒక గురువు. అనాటి నాయకులు చండ్ర పుల్లారెడ్డి తరిమిల నాగిరెడ్డి, సుందరయ్య, ఓంకార్‌తో మొదలుకుని ఈనాటి తరం ఏబీ బర్ధన్, సీతారాం ఏచూరి, ప్రకాశ్ కారత్, డి రాజా, అనీ రాజా, బీవీ రాఘవులు వరకు ఎందరోతోనూ కలిసి కమ్యూనిస్టు భావజాలాన్ని నిర్మించడంలో అయన ఘనపాటి. కమ్యూనిస్టు పార్టీలో అనేక ఒడుదుడకలు వచ్చినప్పుడు కేడర్‌ను కాపాడుకోవడంలో అయనకు అయనే సాటి. కమ్యూనిస్టు పార్టీలో అనేక సమస్యలు నెలకొన్నప్పుడు వాటిని పరిష్కరించి అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చిన మంచి కమ్యూనిస్టు మేధావి. అయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి కార్యదర్శిగా పదవి చేపట్టేటప్పటికీ రాష్ట్రంలో పార్టీలో కేడర్ మసకబారుతున్నది. అయన పార్టీ బాధ్యతను తీసుకుని నడినదిలో ఉన్న పడవను ఒడ్డుకు చేర్చిన యోధుడు. ఒక దళితుడిని కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిని చేయడంలో సురవరం పాత్ర అమోఘం. రాజకీయలలో ఆయన మేధావిగా ప్రసిద్ధుడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక సదస్సులు, గోష్ఠులలో పాల్గొన్నారు. ప్రజోద్యమాలను నిర్మించడంలో అయనకు ఆయనే సాటి.

ప్రజోద్యమాలలో ఆయన స్వయంగా పాల్గొనే వారు. ఈ క్రమంలోనే కొన్ని డజన్ల సార్లు అరెస్టుయ్యారు. జైలులోనూ ఉన్నారు. అనేక కేసులు ఎదుర్కొన్నారు. వామపక్షపార్టీల ఐక్య కార్యాచరణలో అనాటి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బీవీ రాఘవులతో కలసి చేసిన అనేక పోరాటలలో భాగంగానే భూపోరాటం, విద్యుత్ పోరాటాలు వంటి కార్యక్రమాలు ఉద్భవించాయి. చంద్రబాబు నాయుడు హయంలో విద్యుత్ పోరాటం అనేక రూపాల్లో జరిగింది. అప్పుడే బషీర్‌బాగ్ కాల్పులు జరిగి కొంతమంది వామపక్ష కార్యకర్తలను కోల్పోయాం. సురవరం లాంటి నాయకులను జైలులో పెట్టారు. తన మాటలతో, చేతలతో కార్యకర్తలను కదం తొక్కించారు. అంతే కాదు తన వాదనా పటిమతో ప్రత్యర్థులను పరుగులు పెట్టించడం, మేధావులు, నిపుణులు విశ్లేషకుల మద్దతు పొందడం అయన ప్రత్యేకత. అధ్యయనం, అవగాహన ఆచరణతో అయన సమర్థవంతమైన నాయకత్వాన్ని నిర్వహించారు.

సురవరంలో ప్రత్యేక సుగుణాలు

వ్యక్తిగా అయన చాలా సౌమ్యుడు. వక్తగా అద్వితీయుడు. ఉత్తమ కమ్యూనిస్టుగా ఆదర్శ ప్రజా నాయకుడుగా, దీక్షా పటిమ గల నిర్విరామ నిస్వార్థ ప్రజా సేవకుడుగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా జీవితాన్ని గడిపారు. కామ్రేడ్ ఎస్ఎస్ఆర్ ఇన్ని విజయాలు సాధించగలిగారంటే ఆయనలో కొన్ని ప్రత్యేక సుగుణాలుండటమే అందుకు కారణం. ఆయన అంకితభావం, ప్రజలలో ఒకరుగా కలసిపోయి కార్మిక, రైతు ఉద్యమాలను కమ్యూనిస్టు సిద్ధాంతంతో ముందుకు నడిపించిన సిద్దాంత కర్త, 12వ లోక్‌భ , 14వ లోక్‌సభకు నల్లగొండ నియోజకవర్గం నుంచి ఆయన ప్రాతినిథ్యం వహించారు. లోక్‌సభ సభ్యుడిగా అనేక కమిటీలకు సారథ్యం వహించారు. అప్పుడే 2జీ కుంభకోణాన్ని బయట పెట్టడంలో ప్రముఖ పాత్ర పోషించారు. మానవ వనలరుల అభివృద్ధి కమిటీకి సభ్యుడిగా పనిచేశారు. అదే సమయంలో ఆ కమిటిలో భాగమై ఔషధ ధరల నియంత్రణచేయించడంలో ప్రముఖ పాత్ర పోషించారు. కమిటి సభ్యులుగా 1998 నుంచి 1999 దాకా కొనసాగారు. ఆర్థికశాఖ సలహా కమిటిలో సభ్యులుగా ఉన్నారు. విశుద్ధ మార్గంతో మార్క్సిస్టు-లెనినిస్టు పంథాలో సమసమాజమే లక్ష్యంగా ముందుకు సాగిన నేత సురవరం. మతవాద, మితవాద, బుర్జువా రాజకీయాల్లోని క్రూరత్వాన్ని, కుటిలత్వాన్ని, స్వార్థపూరిత దోపిడి విధానాలను ఎండగడుతూ లౌకిక, ప్రజాతంత్ర శక్తులకు అండగా నిలుస్తూ భారత కమ్యూనిస్టు పార్టీలో తన కర్తవ్యాన్ని త్రికర్ణశుద్ధిగా నిర్వహించిన నిజమైన ప్రజాఉద్యమ నేత సురవరంకు లాల్ సలాం.

టి.వి.రమణ, ఫోటో జర్నలిస్టు

ఏఐ.. ఎంత పని చేసింది!

ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ-కృత్రిమ మేధ) విశ్వ సాంకేతిక రంగంలో ఒక గొప్ప పరిణామం, కాదనలేం. కానీ కృత్రిమ మేధ ఒక్కసారిగా వినాశకర పరిస్థితులకు కారణమవుతోంది. ఏఐ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా వేలాది, లక్షలాది మంది ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోతుండగా, దీని ప్రభావం కోట్లాది మంది ఆకలిదప్పులపై పడింది. ముఖ్యంగా టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోత విపరీతంగా ఉంటోంది. పైగా దీని ప్రతికూల ప్రభావం ఇతర రంగాలపై కనీవినీ ఎరుగనిరీతిలో ఉంది. సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ పెరిగే కొద్దీ కార్మికుల ఉపాధికి కోతపడుతుందని ఊహించిందే. కాకపోతే ఇటీవలకాలంలో భారీస్థాయిలో లేఆఫ్‌లు ఉండటం అనూహ్యమే. అమెరికాలోని సిలికాన్ వ్యాలీ అంటేనే సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కంపెనీలకు నిలయం. టెక్ దిగ్గజాలన్నీ ఇక్కడే ఉంటాయి. ఇప్పటికే మైక్రోసాఫ్ట్, అమెజాన్, మెటా వంటి కార్పొరేట్ సంస్థలు భారీగా లేఆఫ్‌లు విధించగా, తాజాగా ఒరాకిల్ కూడా అదే బాటపట్టింది. క్లౌడ్ రంగంలో దిగ్గజ సంస్థగా వెలుగొందుతున్న ఒరాకిల్ ముందుగా క్లౌడ్ విభాగంలోనే ఉన్నత ఉద్యోగులు లక్ష్యంగా లేఆఫ్‌లు విధించింది.

ఒరాకిల్ సంస్థ సియాటిల్ సెంటర్‌లో 161 మందిని తొలగిస్తున్నట్లు వాషింగ్టన్ ఉద్యోగ భద్రతా విభాగానికి సమర్పించిన ఫైలింగ్‌లో పేర్కొంది. సియాటిల్ ఆఫీసులో ప్రస్తుతం 400 మంది ఉద్యోగులు న్నారు. వారిలో డేటా సెంటర్స్ ఆపరేషన్స్ టెక్నీషియన్స్, క్లౌడ్ బృందాలు, టెక్నికల్ ప్రాజెక్టు మేనేజర్లను తొలగించింది. ఉద్యోగుల ఊహకందని విషయమిది. ‘ప్రస్తుతానికి మీకు ఇక్కడ పనిలేదు. బ్యాగులు సర్దుకోండి’ అని నోటీసులో పేర్కొనడం దురదృష్టకరం. ప్రస్తుతం స్టార్‌గేట్ ప్రాజెక్టులో భాగస్వామిగా ఉన్న ఒరాకిల్ ఆ ప్రాజెక్టు విలువను 500 బిలియన్ డాలర్లుగా నిర్ధారించింది. ఈ ప్రాజెక్టులో ఓపెన్ ఏఐ, సాఫ్ట్‌బ్యాంక్ వంటి సంస్థలు కూడా భాగస్వామ్య కంపెనీలే. గత ఏడాది ఒరాకిల్ తన ప్రధాన కార్యాలయాన్ని ఆస్టిన్ నుంచి నాష్‌విల్లేకు మార్చినట్లు ప్రకటించింది.

అమెజాన్, ఒరాకిల్, మైక్రోసాఫ్ట్ వంటి క్లౌడ్, డేటా సెంటర్ల దిగ్గజాలు ప్రస్తుతం ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ మోడల్స్‌పై ఆధారపడటానికే మొగ్గుచూపు తున్నాయి. భారీగా పెరుగుతున్న నిర్వహణ వ్యయాలను తగ్గించుకోవడానికి వీలుగా ఉద్యోగులను తగ్గించుకుంటున్నాయి. మైక్రోసాఫ్ట్ అప్పటికే 15,000 మంది ఉద్యోగులను తొలగించి, ఈ లేఆఫ్‌ల ప్రక్రియకు జెండా ఊపింది. ఏఐ నైపుణ్యాలపై దృష్టి సారించకపోతే, మిగిలిన ఉద్యోగుల పరిస్థితి కూడా లేఆఫ్ బాటపట్టించాల్సి వస్తుందని వెంటనే హెచ్చరించింది. నిజానికి ఇది హెచ్చరిక కాదు..బెదిరింపు. ఒక్క 2025లోనే ఇప్పటివరకు మైక్రోసాఫ్ట్ నాలుగు విడతల్లో ఈ 15 వేలమందిపై వేటు వేసింది. భారత్‌లో సైతం టెక్ దిగ్గజాలు కృత్రిమమేధలో తమ సత్తా చాటేందుకు ఉద్యోగుల సంఖ్యను గణనీయంగా తగ్గించుకునే ప్రయత్నంలో పడింది. ఏఐ వైపు చురుగ్గా అడుగులు వేస్తున్నాయి. ఇటీవలనే టీసీఎస్ 12,000 మంది ఉద్యోగులను దశలవారీగా తగ్గించుకుంటామని ప్రకటించింది. ఇది కంపెనీ మొత్తం ఉద్యోగుల సంఖ్యలో 2 శాతానికి సమానం. ఏఐ కారణంగా భారత్‌లో వచ్చే రెండు మూడేళ్లలో 4 లక్షల నుంచి 5 లక్షల మంది వరకు ఉద్యోగుల్లో కోతపడే అవకాశం ఉందని రాయిటర్స్ తన నివేదికలో వెల్లడించింది. గడిచిన 18 నెలల కాలంలో 1,70,000 మంది అమెరికన్ టెక్ వర్కర్లు తమ ఉద్యోగాలను కోల్పోయారు. 2025 ప్రారంభంలో లేఆఫ్‌లు (ఉద్యోగాల తొలగింపు) 35% పెరిగాయి. 2022-2024 మధ్యకాలంలో ప్రోగ్రామింగ్ రోల్స్‌లో ఉండే ఉద్యోగుల సంఖ్య 27 శాతానికి పడిపోయింది. అన్నింటికీ మించి టెక్ ఉద్యోగుల సగటు జీతం 12%కి పతనమైపోయింది.

సాఫ్ట్‌వేర్ రంగంలో కొన్ని ఉద్యోగాలు త్వరగా తగ్గిపోతాయి, మరికొన్ని ఎక్కువ కాలం నిలబడతాయి. అదొక లక్షణం. ఏఐ ప్రాబల్యంతో డేటా ఎంట్రీ, షెడ్యూలింగ్, కస్టమర్ సర్వీస్ వంటి ఉద్యోగాలను ఇప్పటికే చాట్‌బాట్‌లు, రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ వంటి ఏఐ సాధనాలు అధిగమిస్తున్నాయి.

ఇన్‌స్టిట్యూట్ ఫర్ పబ్లిక్ పాలసీ రీసెర్చ్ 2024లో నిర్వహించిన అధ్యయనంలో 60% అడ్మినిస్ట్రేటివ్ పనులు ఆటోమేట్ చేయదగినవని తేలింది. అంటే కంపెనీ పాలనా వ్యవహారాలు దాదాపు ఏఐతో పూర్తవుతున్నాయన్నమాట!

గురుగ్రామ్‌లో, ప్రతిదీ నిగనిగలాడేదిగా కనిపి స్తుంది. అమెరికన్ సిలికాన్ వ్యాలీకి ఇది ఏమాత్రం తగ్గదు. సొగసైన కార్యాలయాలు, ఎత్తైన అపార్ట్‌మెంట్లు, ప్రీమియం రెస్టారెంట్లు, పబ్బులు వంటి వాటితో కొద్దిమంది మాత్రమే కలలు కనే జీవనశైలి. ఐటీ, టెక్నాలజీలో అగ్రశ్రేణి 500 కంపెనీలకు ఇది నిలయం. ఇప్పుడు బెంగళూరు కూడా అంతే. పెద్ద టెక్ కంపెనీలు, పెద్ద కార్పొరేట్‌లు తమ ఖర్చులను తగ్గించుకోవడానికి ఒత్తిడికి గురవుతున్నం దున, సగటు భారతీయుడి కంటే చాలా ఎక్కువ జీతం పొందుతున్న ఉద్యోగులను తొలగిస్తు న్నారు. దీంతో ఒక్కసారిగా గురుగ్రామ్, బెంగళూరు ప్రాంతాలు తమ ‘టెక్’ కళను కోల్పోతున్నాయి. లేఆఫ్‌ల అనిశ్చితి పెరుగుతున్నందున, ఈమధ్యకాలంలో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు ఉపాధి కోసం ఇబ్బంది పడుతు న్నారు. భారీ తొలగింపులు కార్పొరేట్ అమెరికాను కుదిపేసినప్ప టికీ, ప్రస్తుతం ఎవరూ సురక్షితంగా లేరనే సంకేతాలు కనిపిస్తు న్నాయి. ఎందుకంటే ఈ కంపెనీలలో ఎక్కువ భాగం భారతదేశం వంటి దేశాలలో కూడా పెద్ద కార్యాలయాలను నిర్వహిస్తున్నాయి. అందుకే అమెరికాలో తొలగింపులు భారత్‌లో ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

జూన్ 18న, అమెజాన్ సీఈవో ఆండీ జాస్సీ తమ కంపెనీలో పనిచేస్తున్న 1.5 మిలియన్ల మంది ఉద్యోగులకు ఒక మెమో పంపించారు. కంపెనీ అన్ని సెంటర్లలోనూ కృత్రిమ మేధస్సు సాధనాలను స్వీకరించినందున, కాలక్రమేణా ‘మనం సామర్థ్య లాభాలను పొందుతున్నందున అది చివరికి మన మొత్తం కార్పొరేట్ శ్రామిక శక్తిని తగ్గిస్తుంది, ‘అలాగే జనరేటివ్ ఏఐ ‘మన పని చేసే విధానాన్ని మారుస్తుంది’ అని జాస్సీ ఆ మెమోలో పేర్కొని షాకిచ్చారు. ‘కొన్ని పనులను చేయడానికి తక్కువ మంది వ్యక్తులు, ఇంకొన్ని రకాల ఉద్యోగాలు చేయడానికి ఎక్కువ మంది అవసరం’ అని కూడా సెలవిచ్చారు. కార్పొరేట్ లక్ష్యమేమిటనేది అతని మాటల్లో తేటతెల్లమవు తున్నది. భవిష్యత్‌లో భారీగా ఉద్యోగాల కోతలుంటాయనేది స్పష్టమైన సూచిక. ఈ పరిణామం అధిక జీతాలు, వార్షిక బోనస్‌లు, స్టాక్ అవార్డులు ఉన్నవారిని తీవ్రంగా దెబ్బతీసే అవకాశం ఉందని బ్లూమ్‌బెర్గ్ నివేదిక చెపుతోంది. గూగుల్ సైతం కమ్యూనికేషన్స్, మార్కెటింగ్, రీసెర్చ్, కోర్, నాలెడ్జ్, ఇన్ఫర్మేషన్ వంటి రంగాల్లోని తమ ఉద్యోగులకు స్వచ్ఛంద పదవీవిరమణ పథకాలను అందిస్తోంది. చాలా కోతలు మానవ వనరులు, మార్కెటింగ్, సేల్స్, లీగల్, అకౌంటింగ్, కోడింగ్‌లోనూ చూడవచ్చు. ఐపీఓ ప్రాస్పెక్టస్‌ను ఆరుగురు వ్యక్తులు రెండు వారాల్లో చేయగలిగితే, ఏఐ దీంట్లో 95% పనిని ఒకేఒక్క నిమిషంలో పూర్తి చేయగలదని గోల్డ్‌మన్ సాచ్స్ సీఈఓ డేవిడ్ సోలమన్ తెలిపారు. దీన్నిబట్టి ఏఐ ప్రభావం ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

కారల్ మార్క్స్ తన నోట్స్‌లో ‘మెషీన్ ఇంటలిజెన్స్’ అనే పదాన్ని వాడారు. ఆ తర్వాతికాలంలో సోవియట్ యూనియన్ (యూఎస్ఎస్ఆర్) సైతం ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌పై పరిశోధన నిర్వహించింది. సోవియట్ యూనియన్ పతనానంతరం ఏఐ పరిశోధనలు పూర్తిగా కార్పొరేట్ అనుకూల వ్యవహారంగా మారిపోయింది. పెట్టుబడిదారుల దురాశకు సరిపోయేలా ఏఐ వినియోగం సాగుతోంది. ఏఐ సృష్టించిన క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్, షేర్‌మార్కెట్ నుంచి లాభాలు సైతం కార్పొరేట్ల జేబుల్లోకి వెళ్తున్నాయి. వాటిలో వాస్తవ ఉత్పాదక కార్యకలాపాలంటూ ఏమీ లేవు. అంతిమంగా ఎలాన్ మస్క్ వంటి బిగ్‌షాట్లకు మాత్రమే ఈ ఏఐ ఉపయోగపడుతోంది. డ్రోన్లకు సైతం ఏఐని అన్వయించి, బడా కార్పొరేట్‌లు పంటపొలాల్లో సూక్ష్మ సేద్యాన్ని తమ గుప్పిట్లోకి తీసుకోవడం మరో దారుణమైన పరిణామం. ఏఐతో 5% ఉపాధి లభిస్తుండగా, 95% శాతం ఉపాధి కోల్పోయే పరిస్థితి దాపురించింది. సాంకేతిక అభివృద్ధి కారణంగా కార్మికుల కనీస పనిదినాలు 6 గంటల నుంచి 8 గంటలకు పెరిగిపోయింది. ఏఐ ఈ పరిస్థితిని మరింత దయనీయంగా మార్చబోతున్నది. ఏఐ సంపన్నుల సంపదను పెంచినా, నిరుద్యోగాన్ని, అసమానతలను అదేస్థాయిలో తీవ్రతరం చేస్తున్నది. అందుకు ప్రధాన ఉదాహరణ టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోతలే. మన కళ్లముందు కన్పిస్తున్న నగ్నసత్యమిది.

బషీర్‌బాగ్ విద్యుత్ అమరుల స్ఫూర్తితో మరో ఉద్యమం

ముప్పాళ్ళ భార్గవ శ్రీ

రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై భారీగా భారాలు మోపటానికి నిరసనగా ఆగస్టు 28వ తేదీన “ప్రతిజ్ఞ దినం” పాటించాలని రాష్ట్రంలోని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఆగస్టు 28వ తేదీన పిలుపు ఇవ్వటానికి ముఖ్య కారణం 2020 ఆగస్టు 28న హైదరాబాదులోని బషీర్‌బాగ్ సెంటర్లో పోలీసులు విచక్షణారహితంగా ఆందోళనకారులపై కాల్పులు సాగించిన ఫలితంగా వామపక్ష పార్టీలకు చెందిన ముగ్గురు యువకులు రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి తుపాకీ గుళ్లకు నేలకొరిగారు. ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి విద్యుత్ రంగంలో సంస్కరణలను చేపట్టింది. 2001-2004 మధ్య మొదటి రెండు సంవత్సరాలు సాలీనా 12 శాతం, చివరి రెండు సంవత్సరాలు సాలీనా 15% కలిపి మొత్తం మీద 37% విద్యుత్ ఛార్జీలను పెంచేలా ప్రభుత్వం నిర్ణయం ప్రకటించింది. ధైర్యంగా చార్జీలను పెంచినందుకు చంద్రబాబు ప్రభుత్వానికి ప్రపంచ బ్యాంకు మొదటి విడతగా 21 కోట్ల డాలర్ల రుణాన్ని అందజేసింది కూడా. ఊహించని విధంగా పెద్ద ఎత్తున విద్యుత్ చార్జీలను పెంచడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నిరసనలు భగ్గుమన్నాయి. పెల్లుబికిన ప్రజాందోళనను సంఘటితంగా ముందుకు నడిపించడానికి రాష్ట్రంలోని సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ యూనిటీ ఇనిషియేటివ్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఐ ఎంఎల్ జనశక్తి, సీపీఐ ఎంఎల్ లిబరేషన్, ఎస్‌యూసీఐ ఎంసీపీఐ, మార్క్సిస్టు-లెనినిస్ట్ కమిటీ మొత్తం 9 వామపక్ష పార్టీలు ఐక్యంగా రంగంలోకి దిగాయి. దాదాపు నాలుగు నెలలపాటు రాష్ట్రవ్యాపితంగా ఉద్యమం అంచెలు అంచెలుగా నగరాలు, పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల స్థాయివరకు వెళ్లి ఉధృత రూపం తీసుకుంది. ప్రపంచ బ్యాంకు సీఈఓ నని బాహాటంగా చెప్పుకున్న చంద్రబాబు విద్యుత్ రంగంలో చేపట్టిన ప్రైవేటీకరణ విధానాల ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించి ఉద్యమించేలా చేయటంలో వామపక్ష పార్టీలు శక్తివంతంగా కృషిచేశాయి. రాష్ట్రవ్యాప్తంగా సమరశీలంగా సాగిన ఉద్యమంలో 25వేలకు పైబడి పోలీసు కేసులను కార్యకర్తలు ఎదుర్కొన్నారు. మరోవైపు ప్రతిపక్షంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నాయకత్వంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ విద్యుత్ ఉద్యమంలో భాగస్వామి కావటానికి ఓల్డ్

ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో 90 మంది ఎమ్మెల్యేలతో నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు. ఆనాడు డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న కే చంద్రశేఖరరావు విద్యుత్ చార్జీలను పెంచటానికి నిరసనగా లేఖ ద్వారా అసంతృప్తిని వ్యక్తంచేసి చివరికి డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేశారు. విద్యుత్తు చార్జీల వ్యతిరేక ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమవుతున్న దశలోనే శాసనసభ సమావేశాలు జరపాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఆగస్టు 28న 9 వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పార్టీ విడివిడిగా ‘చలో అసెంబ్లీ’కి పిలుపునిచ్చాయి. ఈ పిలుపు అమలు కాకుండా చేయటానికి రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు కార్యకర్తలకు అడ్డంకులు సృష్టించారు. అయినా ఈ అడ్డంకులన్నీ అధిగమించి వేలాదిమంది కార్యకర్తలు ఇందిరా పార్కుకు చేరుకుని అక్కడి నుంచి అసెంబ్లీ వైపునకు వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు ఇనుపకంచెలు, బారికేడ్లు పెట్టి అడ్డగించడానికి ప్రయత్నించినా వాటిని తోసుకుంటూ బషీర్‌బాగ్ వైపు సాగారు. బషీర్‌బాగ్ చౌరస్తాలోని ఫ్లైఓవర్ క్రింద పోలీసులు పెద్ద ఎత్తున మోహరించి చివరికి ఆందోళనకారులను గుర్రాల చేత తొక్కించారు. ఎక్కడికక్కడ లాఠీ చార్జీలు, బాష్పవాయు గోళాలు పెద్ద ఎత్తున ప్రయోగించారు. అయినా అసెంబ్లీ వైపునకు దూసుకెళుతున్న ఉద్యమకారులను ఆపటానికి ఒక పోలీసు అధికారి కావాలని ఒక కానిస్టేబుల్‌ని కాల్చడంతో పథకం ప్రకారం పరిస్థితిని ఉద్రిక్తంగా మార్చి ఎలాంటి హెచ్చరికలు లేకుండా, ఆఖరికి గాలిలోకి కూడా కాల్చకుండా నేరుగా ఉద్యమకారులపై తుపాకులను ఎక్కుపెట్టి ముగ్గురు యువకుల ప్రాణాలు పోయేలా చేశారు. పోలీసులు విచక్షణారహితంగా కాల్చిన కాల్పుల వలన 23 మంది ఉద్యమకారులు బుల్లెట్ల వల్ల తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల లాఠీ దెబ్బలకు ఉద్యమకారుల తలలు పగిలాయి, కాళ్లు చేతులు విరిగాయి. చంద్రబాబు ప్రభుత్వం ఉద్యమకారులపై సాగించిన పాశవిక హత్యాకాండ రాష్ట్ర చరిత్రలో ‘బ్లాక్ మండే’ గా మిగిలిపోయింది. ఈ ఘనత ప్రపంచ బ్యాంకు నిషాను తలకిఎక్కించుకున్న ‘హైటెక్’ చంద్రబాబుకే దక్కుతుంది. విద్యుత్ ఉద్యమంపై ఎంత పెద్ద ఎత్తున నిర్బంధం అమలు జరిగిందనే దానికి ఈ వివరాలు సాక్ష్యంగా నిలుస్తాయి. ప్రపంచ బ్యాంకు మెప్పుకోసం, వారి కితాబులకోసం ఈ ఘాతుకానికి చంద్రబాబు ఒడిగట్టారనేది బహిరంగ రహస్యం. విద్యుత్ ఉద్యమంలో నేలకొరిగిన అమరుల జ్ఞాపకార్థం బషీర్‌బాగ్‌లో వామపక్ష పార్టీలు అమర స్తూపం నిర్మించి ఆనాటి నుంచి ప్రతి సంవత్సరం ఆగస్టు 28వ తేదీన అమరుల త్యాగాలను స్మరించుకొని కర్తవ్యాలను రూపొందించుకుంటు న్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రభావం చూపిన ఈ ఉద్యమం ఫలితంగా తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబును ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించారు. 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచకపోగా తగ్గిస్తామన్న హామీని మరిచి అధికారం చేపట్టిన ఏడాదికాలంలో ట్రూఅప్ చార్జీల పేరుతో వేల కోట్ల రూపాయల భారం మోపడం, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన స్మార్ట్‌మీటర్లను అధికారంలోకి వచ్చిన తర్వాత బలవంతంగా బిగించడం వంటి చంద్రబాబు ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ మరలా 25 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో 9 వామపక్ష పార్టీలు ఆగస్టు 28న ‘ప్రతిజ్ఞా దినం’ పాటించాలని పిలుపు ఇచ్చాయి. రాష్ట్రం విడిపోయిన తర్వాత, యాదృచ్ఛికంగా ఇప్పుడు కూడా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారు. బషీర్ బాగ్ కాల్పులు జరిగి 25 సంవత్సరాలు నిండినా చంద్రబాబు అనుసరిస్తున్న విధానాలలో ఏమాత్రం మార్పు లేకపోగా రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉందన్న ధీమాతో కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను చంద్రబాబు ప్రభుత్వం రెట్టించిన ఉత్సాహంతో అమలుచేస్తున్న ఫలితంగా విద్యుత్ రంగంలో సరికొత్త విధానాలను అనుసరిస్తూ ప్రజలపై మరిన్ని భారాలు మోపదానికే పథకాల రూపొందిస్తున్నారు. దాని ఫలితంగానే నేడు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాలలో పెరుగుతున్న విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు.

విద్యుత్ చార్జీలను పెంచేది లేదని మాయమాటలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఇప్పటికే వినియోగదారులపై రూ.15,485 కోట్ల సర్దుబాటు చార్జీల భారం మోపింది. ఈ భారంకాక నాలుగు రకాల అదనపు సర్దుబాటు చార్జీలు ట్రూ అప్, ఎఫ్‌పీపీసీఏ ల పేరుతో అదనంగా కోట్ల రూపాయలలో వినియోగదారుల నుంచి పిండుతున్నారు. ఈ భారాలు చాలావన్నట్లు బడా కార్పొరేట్ శక్తి అదానీ ప్రయోజనాలకోసం స్మార్ట్ మీటర్ల నిలువు దోపిడీ పథకానికి తెరలేపింది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విద్యుత్ సవరణ బిల్లును ఆర్డినెన్స్ రూపంలో తెచ్చిన దాన్ని అడ్డం పెట్టుకొని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపు కోసం చేస్తున్న ప్రయత్నాలపై వామపక్ష శక్తులతో కూడిన విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక అంచలవారి ఉద్యమాన్ని సాగిస్తున్నది. ఇప్పటికే స్మార్ట్ మీటర్లను కేరళ, కర్నాటక, తమిళనాడు లాంటి రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వం ప్రారంభించిన స్మార్ట్ మీటర్ల ప్రయోగాన్ని వామపక్ష శక్తులు ఐక్యంగా తిప్పికొట్టాయి. ఇప్పుడు మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ రంగంలో సంస్కరణల పేరుతో వినియోగదారులపై వేస్తున్న మోయలేని భారాలను తిప్పి కొట్టడానికి బషీర్‌బాగ్ లో విద్యుత్ అమరుల స్థూపం సాక్షిగా, వామపక్ష పార్టీలు ఆగస్టు 28న ‘ప్రతిజ్ఞా దినం’ జరపాలని ఇచ్చిన పిలుపును ఉద్యమ స్ఫూర్తితో అమలు చేయటానికి బాధిత వినియోగదారులు కంకణధారులు కావాలి!

సెల్ నెం. 98481 20105

ఆప్ నేత ఇంట్లో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ: ఆమ్‌ఆద్మీ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోదాలు చేపట్టారు. ఆయన ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సమయంలో చేపట్టిన ఆసుపత్రుల నిర్మాణంలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కుంభకోణానికి సంబంధించి ఈడీ మంగళవారం తనిఖీలు చేపట్టింది. ఢిల్లీలోని సౌరభ్ భరద్వాజ్ నివాసంతో పాటు మరో 12 ప్రాంతాల్లో ఏకకాలంలో దర్యాప్తు సంస్థ అధికారులు ఈ సోదాలు చేపట్టారు. 2018-19లో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో 24 ఆసుపత్రుల నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం రూ.5,590 కోట్లతో ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఓ ఐసీయూ ఆసుపత్రిని ఆరు నెలల్లో పూర్తి చేయాల్సి ఉండగా.. మూడేళ్లు దాటినా అది పూర్తికాలేదు. ఇందుకోసం రూ.800 కోట్లు ఖర్చు చేసినా.. కేవలం సగం పనులు మాత్రమే పూర్తయ్యాయి. దీంతో ఆ ప్రాజెక్టులో అవకతవకలు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. వీటి ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ఈ కేసులోనే తాజాగా సౌరభ్ భరద్వాజ్ నివాసంలో తనిఖీలు చేపట్టింది. ఈ దాడులను ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా ఖండించింది. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు సౌరభ్‌పై తప్పుడు కేసు నమోదు చేశారని ఆప్ పేర్కొంది. ఈడీ చెబుతున్న సమయంలో ఆయన మంత్రిగా లేరని తెలిపింది. కేవలం కక్ష సాధింపుకోసమే ప్రభుత్వ సంస్థల్ని దుర్వినియోగం చేస్తున్నారని బీజేపీపై మండిపడింది.

బీహార్ ఎన్నికల ముందే బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎంపిక!

న్యూఢిల్లీ: త్వరలోనే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. అయితే ఈలోపే బీజేపీ జాతీయ అధ్యక్షుడిని ఎంపిక చేయాలని ఆ పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. బీహార్ ఎన్నికల షెడ్యూల్ రాకముందే కొత్త అధ్యక్షుడిని నియమించాలని అధిష్టానం కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది. సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నికలు పూర్తికానున్నాయి. అనంతరం బీజేపీ కొత్త అధ్యక్షుడి నియామకాన్ని కూడా పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నట్లుగా సమాచారం. ప్రస్తుతం జేపీ నడ్డా జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అనేకమార్లు ఆయన పదవీకాలం పొడిగించారు. దీంతో కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేయాలని ఆ పార్టీ ఆలోచన చేస్తోంది. అంతకంటే ముందే ఉత్తరప్రదేశ్, గుజరాత్, కర్నాటక వంటి కీలక రాష్ట్రాల్లో కొత్త రాష్ట్ర అధ్యక్షులను నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్ నుంచి బీజేపీ జాతీయ మండలి సభ్యుడిగా, గుజరాత్ నుంచి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎన్నికవుతారు. అనంతరం కొత్త అధ్యక్షుడి నామినేషన్ పత్రాలకు ప్రతిపాదకులుగా వ్యవహరించడానికి వీరిద్దరూ అర్హులు అవుతారు. అయితే కొత్త జాతీయ అధ్యక్షుడి ఎంపిక కుల, ప్రాంతీయ లేదా సామాజిక సమీకరణాల ఆధారంగా జరగకూడదని పార్టీ నాయకత్వం ఆలోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పార్టీని బలోపేతం చేసే వ్యక్తిని మాత్రమే ఎంపిక చేయనున్నట్లు సమాచారం. జాతీయ స్థాయిలో సంస్థాగతంగా మంచి అనుభవం ఉన్న సీనియర్ నేతకు ఆ బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

శ్రీదేవి ఆస్తి కబ్జా...
కోర్టుకెక్కిన బోనీకపూర్

చెన్నై: తన భార్య దివంగత నటి శ్రీదేవి ఆస్తిని ముగ్గురు వ్యక్తులు కబ్జా చేశారంటూ బోనీ కపూర్ కోర్టును ఆశ్రయించారు. వారు చట్టవిరుద్ధంగా హక్కులను సొంతం చేసుకున్నారని ఆరోపించారు. ఆమె ఎంతో కష్టపడి ఆ స్థిరాస్తిని కొనుగోలు చేసిందని ఈ విషయంలో తమకు న్యాయం చేయాలంటూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. దాని వివరాలను కోర్టుకు వివరించారు. 1988 ఏప్రిల్‌లో శ్రీదేవి మద్రాసులో ఎంసీ సంబంద మొదలియార్ అనే వ్యక్తి వద్ద స్థిరాస్తిని కొనుగోలు చేశారు. దానికి సంబంధించిన పత్రాలన్నీ పరిశీలించిన తర్వాతే ఆమె దాన్ని కొనుగోలు చేసినట్లు బోనీ కపూర్ తెలిపారు. అతడికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారని, వారందరి దగ్గర వారసత్వ ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించిన తర్వాతనే శ్రీదేవి ఈ ఆస్తిని సొంతం చేసుకున్నట్లు బోనీ కపూర్ వెల్లడించారు. అయితే, ఎంసీ సంబంద మొదలియార్ రెండో భార్య కుమారులు ఈ ఆస్తిలో వారికి వాటా ఉందంటూ తహశీల్దార్ కార్యాలయంలో అప్పీల్ చేశారన్నారు. ప్రభుత్వ అధికారుల నిర్ణయంతో తాజాగా చట్టవిరుద్ధంగా దీని హక్కులను సొంతం చేసుకున్నారని బోనీ కపూర్ హైకోర్టులో కేసు వేశారు. మోసపూరితమైన పత్రాలను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన భార్య బతికి ఉండగానే మొదలియార్ రెండో వివాహం చేసుకున్నారన్న విషయాన్నీ బోనీ కపూర్ ప్రస్తావించారు. విచారించిన జస్టిస్ ఆనంద్ వెంకటేశ్ నాలుగు వారాల్లోగా దీనిపై నిర్ణయం తీసుకోవాలని.. ధ్రువీకరణ పత్రం ఇచ్చిన తాంబరం తాలూకా తహసీల్దార్‌ను ఆదేశించారు.

ఉత్తర భారతాన కుంభవృష్టి

జమ్మూలో మెరుపు వరదలు

నలుగురి మృతి

దోడాలో కొట్టుకుపోయిన ఇళ్లు

జమ్మూ/చండీగఢ్/సిమ్లా: ఉత్తర భారతంలో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ తదితర ఉత్తరాది రాష్ట్రాల్లో కుండపోత వర్షం కురుస్తోంది. ఈ వర్షానికి అనేక చోట్ల ఆకస్మిక వరదలు సంభవిస్తున్నాయి. జమ్మూలో భారీ వర్షాలు కురుస్తుండటంతో నలుగురు మరణించగా... రెండు డజన్లకు పైగా ఇళ్లు, వంతెనలు దెబ్బతిన్నాయి. దాదాపు అన్ని జలాశయాలు ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తున్నాయి. నగరంలోనూ, ఇతర ప్రాంతాల్లోనూ లోతట్టు ప్రాంతాలు, రోడ్లు మునిగిపోయాయని అధికారులు తెలిపారు. అనేక ప్రాంతాల్లో పరిస్థితి 'చాలా తీవ్రంగా' ఉందని, పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించడానికి శ్రీనగర్ నుంచి జమ్మూకు తదుపరి విమానంలో వెళుతున్నట్లు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తెలిపారు. జమ్మూ-శ్రీనగర్, కిష్త్వార్-దోడా జాతీయ రహదారులపై ట్రాఫిక్‌ను నిలిపివేశారు. కొండచరియలు విరిగిపడటం లేదా ఆకస్మిక వరదల కారణంగా డజన్ల కొద్దీ కొండ రోడ్లు దెబ్బతిన్నాయి లేదా దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. వర్షాల దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యగా మాతా వైష్ణో దేవి మందిరానికి యాత్రను కూడా నిలిపివేసినట్లు వివరించారు. కాగా, గాండోలో ఇద్దరు, థాత్రిలో ఒకరు వేర్వేరు వర్ష సంబంధిత సంఘటనలలో మరణించగా, 15 ఇళ్లు, నాలుగు వంతెనలు దెబ్బతిన్నాయని చెప్పారు. కిష్త్వార్, రియాసి, రాజౌరి, రాంబన్, పూంచ్ జిల్లాల ఎత్తయిన ప్రాంతాల నుంచి కూడా ప్రభుత్వ, ప్రైవేటు మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లినట్లు నివేదికలు వచ్చాయని, వాస్తవ పరిస్థితిని అంచనా వేసిన తర్వాతే బయటపడుతుందని అధికారులు తెలిపారు. జమ్మూలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా ముఖ్యమంత్రి శ్రీనగర్‌లో సమావేశం నిర్వహించి, అధిక హెచ్చరికను కొనసాగించాలని, అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పొంగిపొర్లుతున్న మోధోపూర్ బ్యారేజీ లక్ష క్యూసెక్కులను దాటిందని, నిరంతరం పెరుగుతోందని, కతువా జిల్లాలో రావి నది వెంబడి ఉన్న అనేక లోతట్టు ప్రాంతాలలో భారీ వరదలు వస్తున్నాయని అధికారులు తెలిపారు. తరానా నది, ఉజ్ నది, మగ్గర్ ఖాడ్, సహర్ ఖాడ్, వాటి ఉపనదులైన కతువా, సాంబాలోని బసెంటర్, జమ్మూలో తవి చీనాబ్‌లలో నీటి మట్టాలు ఒకేసారి పెరుగుతున్నాయని, ఇప్పటికే ప్రమాద స్థాయిని దాటాయని వివరించారు.

వరదలు ప్రవహించే నదులకు దూరంగా ఉండాలని, సురక్షిత ప్రదేశాలకు మారాలని పోలీసులు, పౌర అధికారులు ప్రజలకు తరచూ ప్రకటనలు చేస్తున్నారు. వాతావరణ శాఖ ప్రకారం, ఉదయం 8.30 గంటలకు ముగిసిన గత 24 గంటల్లో కతువా జిల్లాలో అత్యధికంగా 155.6 మిమీ వర్షపాతం నమోదయింది. తరువాత దోడాలోని భదేర్వాలో 99.8 మిమీ, జమ్మూలో (81.5 మిమీ), కత్రాలో (68.8 మిమీ) వర్షపాతం నమోదయింది. జమ్మూ, సాంబా, కతువా, రియాసి, ఉధంపూర్, రాజౌరి, రాంబన్, దోడా, కిష్త్వార్ జిల్లాల్లోని అనేక చోట్ల ఆగస్టు 27 వరకు మేఘావృతాలు, ఆకస్మిక వరదలు, ఎత్తయిన ప్రాంతాలలో కొండచరియలు విరిగిపడే అవకాశం ఉందని వాతావరణ సూచన అంచనా వేస్తున్నందున, అధికారులు ఇప్పటికే నీటి వనరులు, కొండచరియలు విరిగిపడే ప్రాంతాలకు దూరంగా ఉండాలని ప్రజలను కోరుతున్నారు.

పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో భారీ వర్షాలు

జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లలో భారీ వర్షాల తర్వాత ఉజ్, రావి నదులు, వాగులలో నీటి మట్టం పెరగడంతో పంజాబ్‌లోని పఠాన్‌కోట్ జిల్లాలోని భారత-పాకిస్తాన్ సరిహద్దుకు సమీపంలోని అనేక గ్రామాలు ప్రభావితమయ్యాయి. పంజాబ్ క్యాబినెట్ మంత్రి లాల్ చంద్ కటారుచక్ ఆదివారం బాధిత ప్రాంతాలను సందర్శించి, పరిస్థితిని సమీక్షించి, రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా నష్టానికి పరిహారం ఇస్తుందని ప్రజలకు హామీ ఇచ్చారు. ఉజ్, రావి నదులు, అలాగే వాగులలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం వలన భారత్-పాక్ సరిహద్దు వెంబడి ఉన్న గ్రామాలలో పరిస్థితి దారుణంగా ఉంది.

హిమాచల్‌లో వర్ష బీభత్సం

హిమాచల్ ప్రదేశ్‌లోని అనేక చోట్ల భారీ వర్షానికి కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు సంభవించడంతో అనేక దుకాణాలు కొట్టుకుపోయాయి, భవనాలు కూలిపోయాయి. నివాస ప్రాంతాలు జలమయం అయ్యాయి. దీంతో రహదారులను మూసివేశారు. అయితే సోమవారం రాత్రి నుంచి నివేదించబడిన ఏ సంఘటనలోనూ ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. కాంగ్రా, చంబా, లాహౌల్, స్పితి జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో మంగళవారం తీవ్రమైన వర్షాలు కురుస్తాయని స్థానిక వాతావరణ కార్యాలయం 'రెడ్' అలర్ట్ జారీ చేసింది.

ఉనా, హమీర్‌పూర్, బిలాస్‌పూర్, సోలన్, మండి, కులు జిల్లాలు, సిమ్లా నగరంలో తీవ్రమైన వర్షాలకు 'ఆరెంజ్' అలర్ట్ కూడా జారీ చేసింది. మరోవైపు, మంగళవారం తెల్లవారుజామున బియాస్ నది ఉధృతంగా ప్రవహించడంతో కులు జిల్లాలోని మనాలిలో ఒక బహుళ అంతస్తుల హోటల్, నాలుగు దుకాణాలు కొట్టుకుపోయాయి. అలాగే సోమవారం రాత్రి మండి జిల్లాలోని బలిచౌకి ప్రాంతంలో సుమారు 40 దుకాణాలు ఉన్న రెండు భవనాలు కూలిపోయాయి. భారీ వర్షాల నేపథ్యంలో వివిధ జిల్లా పరిపాలనలు అన్ని విద్యా సంస్థలను మూసివేయాలని ఆదేశించాయి. మంగళవారం ఉదయం సిమ్లా జిల్లా యంత్రాంగం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలను మూసివేయాలని ఆదేశించింది. జూన్ 1 నుంచి ఆగస్టు 25 వరకు హిమాచల్ ప్రదేశ్‌లో సగటున 577.9 మి.మీ వర్షపాతం నమోదయింది. ఇది 22 శాతం ఎక్కువ. ఆగస్టులో ఇప్పటివరకు రాష్ట్రంలో 44 శాతం అధిక వర్షపాతం నమోదయింది.

కాంగ్రెస్ వాదిగానే చనిపోతా : డీకే

బెంగళూరు : ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థన గీతాన్ని పాడినందుకు పార్టీలోనే విమర్శలు రావడంతో కుంగిపోయిన కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంగళవారం రాష్ట్ర అసెంబ్లీలో దాని ప్రదర్శనపై ఎవరైనా బాధపడితే క్షమించండి అని, తాను కాంగ్రెస్‌వాడినని, అలాగే చనిపోతానని తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కూడా అయిన శివకుమార్ ఇటీవల సభలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థన గీతాన్ని పాడటం ద్వారా అందరినీ ఆశ్చర్యపరిచారు. మంగళవారం ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'ఎవరైనా బాధపడితే నన్ను క్షమించండి. పార్టీ అధిష్టానం నుంచి ఎవరూ దీని గురించి నన్ను ప్రశ్నించలేదు. నేను అసెంబ్లీలో 'పాసింగ్ రిఫరెన్స్' చేశాను' అని తెలిపారు. 'నేను ఎవరికంటే పెద్దవాడిని కాదు. అందరికీ బలాన్ని ఇవ్వడానికి నా జీవితం ఉంది. నేను ప్రతి ఒక్కరి కష్టాల్లో అండగా నిలిచాను. అయినప్పటికీ నేను వారికి అండగా నిలుస్తాను. ఒక నమ్మకమైన కాంగ్రెస్ సభ్యుడిగా నేను ఎవరి మనోభావాలను గాయపరచకూడదనుకుంటున్నాను. కాంగ్రెస్ సభ్యులందరికీ, ఇండియా ఐక్య సంఘటనలోని అనేక రాజకీయ పార్టీ స్నేహితులకు వారు బాధపడవచ్చు. 'నేను చేయని తప్పు చేశానని మీరు భావిస్తే, నేను ఇప్పటికీ క్షమాపణ చెప్పడానికి సిద్ధంగా ఉన్నాను' అని తెలిపారు. ఆగస్టు 21న జూన్ 4న చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో శివకుమార్ ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థన 'నమస్తే సదా వత్సలే...' లోని రెండు పంక్తులను పఠించారు. సభలోని బల్లలను చరుస్తూ శివకుమార్ గీతం ఆలపించడాన్ని బీజేపీ స్వాగతించింది. కాంగ్రెస్ పార్టీ, గాంధీ కుటుంబం పట్ల తన విధేయతను పునరుద్ఘాటిస్తూ, 'కాంగ్రెస్ పార్టీ, గాంధీ కుటుంబం పట్ల నా విధేయతను ఎవరూ ప్రశ్నించలేరు' అని శివకుమార్ అన్నారు. 'నేను జన్మతః కాంగ్రెస్ సభ్యుడిని. నేను కాంగ్రెస్ సభ్యుడిగానే చనిపోతాను' అని తెలిపారు. అసెంబ్లీ లోపల ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థన పాడటం ద్వారా శివకుమార్ ఎవరినైనా ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారా అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బి.కె.హరిప్రసాద్ సోమవారం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రిగా శివకుమార్ ప్రార్థన చేయడానికి మాకు ఎటువంటి అభ్యంతరం లేదు. ఎందుకంటే ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్‌తో సహా అందరికీ చెందినది. కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆయన అలా మాట్లాడితే క్షమాపణ చెప్పాల్సి ఉంటుంది' అని హరిప్రసాద్ డిమాండ్ చేశారు.

శాంతిని కోరుకోవడం బలహీనతగా చూడొద్దు
త్రివిధ దళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్

భోపాల్: ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు...అది ఇప్పటికీ కొనసాగుతోందని త్రివిధ దళాధిపతి (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ శాంతినే కోరుకుంటుందని, అయితే దానిని బలహీనతగా భావించరాదని ఆయన స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని మౌలో ఆర్మీ వార్ కాలేజీలో మంగళవారం ప్రారంభమైన 'రణ్ సంవాద్' సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా చేపట్టిన ఆపరేషన్ పేరును ప్రస్తావిస్తూ పాకిస్థాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు పంపారు. ఈ సందర్భంగా జనరల్ చౌహాన్ మాట్లాడుతూ, "భారత్ ఎల్లప్పుడూ శాంతి వైపే నిలబడుతుంది. మేము శాంతిని ప్రేమించే వాళ్ళం. అయితే దానిని ఆసరాగా చేసుకుని మమ్మల్ని దెబ్బకొట్టాలని చూస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తి లేదు" అని అన్నారు. గతంలో జరిగిన యుద్ధాలకు, ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలకు వ్యత్యాసం ఉందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో యుద్ధాల స్వరూపం పూర్తిగా మారిపోతుందని ఆయన విశ్లేషించారు. దీనిని ప్రభావితం చేసే నాలుగు ముఖ్యమైన అంశాలను ఆయన వివరించారు. "రాజకీయ లక్ష్యాలను సాధించడానికి చిన్నపాటి యుద్ధాలను ఉపయోగించే ధోరణి దేశాల మధ్య పెరిగింది. యుద్ధం, శాంతి మధ్య తేడా చెరిగిపోతోంది. ఒకప్పుడు యుద్ధాలు భూభాగం కోసం జరిగితే, ఇప్పుడు ప్రజల ప్రాణాలకు ఎక్కువ విలువ ఇస్తున్నారు. గతంలో శత్రువులకు కలిగించిన నష్టం ఆధారంగా విజయాన్ని అంచనా వేసేవారు. కానీ ఇప్పుడు, ఆపరేషన్ల వేగం, కచ్చితత్వంతో కూడిన దాడులు విజయాన్ని నిర్ధారిస్తున్నాయి" అని ఆయన తెలిపారు.'వికసిత భారత్' లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశం 'సశస్త్ర', 'సురక్షిత్', 'ఆత్మనిర్భర్'గా ఉండాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా వాయు, జల, భూతల మార్గాల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి త్రివిధ దళాల మధ్య మరింత సమన్వయం అవసరమని ఆయన పేర్కొన్న విషయం తెలిసిందే. రెండు రోజుల పాటు జరిగే ఈ 'రణ్ సంవాద్' సదస్సు ముగింపు కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించనున్నారు.

షోరూమ్‌లో భారీ అగ్నిప్రమాదం...
60 ద్విచక్ర వాహనాలు దగ్ధం

ముంబై: మహారాష్ట్రలోని పూణె లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సోమవారం రాత్రి ద్విచక్ర వాహనాల షోరూమ్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి ఈ మంటల్లో పదుల సంఖ్యలో బైక్‌లు కాలి బూడిదయ్యాయి. నగరంలోని తారాబాగ్ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. బండ్ గార్డెన్ రోడ్డులోని మూడంతస్తుల భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో టీవీఎస్ షోరూమ్, సర్వీస్ సెంటర్ ఉంది. సోమవారం రాత్రి 8:30 గంటల సమయంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటలు చెలరేగినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. కాసేపటికే మంటలు భవనం మొత్తం వ్యాపించినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. ఈ ప్రమాదంలో షోరూమ్‌లోని దాదాపు 60 ద్విచక్ర వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదం నుంచి ఒకరిని సురక్షితంగా రక్షించారు. కాలిపోయిన వాహనాల్లో కొన్ని పెట్రోల్ వాహనాలు కాగా, మరికొన్ని ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. కొన్ని కొత్త వాహనాలు కాగా, మరికొన్ని రిపెయిర్స్ కోసం ఉంచిన వాహనాలు అని అధికారులు తెలిపారు. వాహనాలతోపాటూ కొన్ని స్పేర్ పార్ట్స్, కంప్యూటర్స్, ఫర్నిచర్, ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు, విలువైన పత్రాలు దగ్ధమైనట్లు పేర్కొన్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీలో ప్రపంచ హబ్‌గా భారత్
ప్రధాని మోదీ

అహ్మదాబాద్: ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ, ఎగుమతుల రంగంలో భారత్ ముందడుగు వేసింది. ఇకపై 'మేడ్ ఇన్ ఇండియా' ఈవీలు ప్రపంచవ్యాప్తంగా 100 దేశాలకు ఎగుమతి కానున్నాయి. అహ్మదాబాద్‌లోని హన్సల్‌పూర్‌లో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఎగుమతులను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఇదే వేదికపై హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల స్థానిక ఉత్పత్తిని కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీ రంగాల్లో భారత్ ప్రపంచ హబ్‌గా అవతరించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. "గణేశ్ ఉత్సవ్ సందర్భంగా మేక్ ఇన్ ఇండియాలో సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇవాళ్టి నుంచి దేశీయంగా రూపొందించిన విద్యుత్ వాహనాలు 100 దేశాలకు ఎగుమతి అవుతాయి. విద్యుత్ వాహనాల్లో బ్యాటరీ తయారీ ముఖ్యమైన అంశమని మనందరికీ తెలుసు. కొన్నేళ్ల క్రితం వరకు బ్యాటరీలను దిగుమతి చేసుకున్నాం. విద్యుత్ వాహనాల తయారీని బలోపేతం చేయడానికి భారత్‌లోని బ్యాటరీలను ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉంది. అందులో భాగంగానే 2017లో టీడీఎస్‌జీ బ్యాటరీ యూనిట్‌కు శంకుస్థాపన చేశాం. భారత్‌కు ప్రజాస్వామ్య శక్తితో పాటు జనాభా అనుకూలత ఉంది. అధిక సంఖ్యలో నైపుణ్యంతో కూడిన మానవవనరులు అందుబాటులో ఉన్నారు. భారత్‌లో పెట్టుబడి పెడితే భాగసామ్యం అయిన ప్రతిఒక్కరికీ లాభదాయకమే" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారత్-జపాన్ మధ్య బంధం కేవలం వ్యాపారానికే పరిమితం కాదని, చారిత్రక, సాంస్కృతిక మూలాలున్నాయని ప్రధాని గుర్తుచేశారు. "సుజుకి వంటి జపాన్ కంపెనీలు ఇక్కడ కార్లను తయారు చేసి, తిరిగి జపాన్‌కే ఎగుమతి చేస్తున్నాయి. ఇదే మన రెండు దేశాల సంబంధాల బలానికి నిదర్శనం. మారుతి సుజుకితో మొదలైన ఈ ప్రయాణం ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ వేగంతో దూసుకెళుతోంది" అని మోదీ వ్యాఖ్యానించారు. గత దశాబ్దంలో తమ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, 'మేక్ ఇన్ ఇండియా' వంటి కార్యక్రమాల ఫలాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. పదేళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ 500 శాతం పెరిగిందని అన్నారు. భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, "మనం ఇక్కడితో ఆగిపోం. ఇకపై సెమీకండక్టర్ల తయారీపై దృష్టి పెడతాం. త్వరలో ఆరు ప్లాంట్లు సిద్ధం కాబోతున్నాయి. అదేవిధంగా కీలక ఖనిజాల కోసం 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్'ను ప్రారంభించాం" అని ప్రధాని వెల్లడించారు. అభివృద్ధి అనుకూల విధానాల రూపకల్పనలో రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడాలని, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూరగొనాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

మారుతి సుజుకీకి చెందిన తొలి ఎలక్ట్రిక్ వాహనం ఆవిష్కరణ

గుజరాత్‌లో రెండో రోజు పర్యటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, అంతకుముందు మారుతి సుజుకీ సంస్థకు చెందిన తొలి ఎలక్ట్రిక్ వాహనం ఈ-విటారాను ఆవిష్కరించారు. సుజుకీ, తోషిబా, డెన్సో సంస్థలు సంయుక్తంగా నిర్మించిన లిథియం అయాన్ బ్యాటరీ తయారీ యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం హన్‌సల్‌పుర్‌లో ఉన్న మారుతి సుజుకీ కార్ల తయారీ యూనిట్‌ను మోదీ పరిశీలించారు. ఈ-విటారాకు సంబంధించిన విశేషాలతో పాటు ప్లాంట్‌లో ఉపయోగిస్తున్న ఆధునిక సాంకేతికతను కంపెనీ ప్రతినిధులు మోదీకి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని వెంట గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర భాయ్ పటేల్‌తో పాటు మంత్రులు పాల్గొన్నారు. దేశీయంగా రూపొందించిన ఈ-విటారాను జపాన్ సహా 100కుపైగా దేశాలకు ఎగుమతి చేస్తామని మారుతి సుజుకీ కంపెనీ తెలిపింది. ఐరోపాలో జరిగిన ప్రదర్శనలో మారుతి సుజుకీ సంస్థ తొలిసారి ఈ-విటారాను ప్రపంచానికి పరిచయం చేసింది. ఈ-విటారా రెండు బ్యాటరీ వేరియంట్‌లతో మార్కెట్‌లోకి అందుబాటులోకి రానుంది.

మాజీ ఉపరాష్ట్రపతి ధన్కర్ ఏం చేస్తున్నారంటే?

న్యూఢిల్లీ: మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ జులై 21న అనూహ్యంగా పదవికి రాజీనామా చేయడంపై రాజకీయ దుమారం రేగిన సంగతి విదితమే. అనారోగ్య కారణాల చేత పదవికి రాజీనామా చేసినట్లు రాష్ట్రపతికి లేఖ పంపినప్పటికీ దీనిపై ఎన్నో అనుమానాలున్నాయని, ఆయన చేత బీజేపీ అధిష్టానం బలవంతంగా రాజీనామా చేయించినట్లు ప్రతిపక్షాలు ఆరోపించాయి. అయితే అప్పటి నుంచి బహిరంగంగా ఎప్పుడూ కనిపించలేదు. దీంతో ఆయన ఏమయ్యారంటూ కేంద్రానికి లేఖలు రాశాయి. ధన్కర్ సమాచారం ఇవ్వాలంటూ అమిత్ షాను శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ కోరారు. తాజాగా జగదీప్ ధన్కర్ గురించి కీలక సమాచారం బయటకు వచ్చింది. ప్రస్తుతం ధన్కర్ ఓటీటీ షోలు చూడటం, టేబుల్ టెన్నిస్ ఆడటం, యోగా చేస్తున్నారంటూ ఓ అధికారి తెలిపారు. మాజీ ఉపరాష్ట్రపతిగా ప్రభుత్వం తగిన బంగ్లాను కేటాయించిందని చెప్పారు. అధికారికంగా కారు, ఎస్కార్ట్ కారు, సెక్యూరిటీ గార్డులు, ఇతర ప్రయోజనాలన్నీ లభిస్తాయని పేర్కొన్నారు. జాతీయ మీడియా కథనం ప్రకారం మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సాయంత్రం పూట ఆయన టేబుల్ టెన్నిస్ ఆడుతున్నట్లుగా తెలుస్తోంది. ఉదయం పూట మాత్రం యోగా సాధన చేస్తున్నారని సమాచారం. ఓ గురువు ప్రత్యేక సెషన్లు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అనంతరం ఓటీటీ వాచ్‌లిస్టులో ది లింకన్ లాయర్, హౌస్ ఆఫ్ కార్డ్స్ చూస్తున్నారు. వాస్తవానికి వృత్తిపరంగా ధన్కర్ న్యాయవాది కావడం విశేషం. ఇక భార్య సుదేష్ ధన్కర్ గత నెలలో రాజస్థాన్‌కు కనీసం మూడు రోడ్ ట్రిప్‌లు చేసినట్లు తెలుస్తోంది. జైపూర్‌లో పూర్వీకుల వ్యవసాయ భూమిలో ధన్కర్ దంపతులు రెండు వాణిజ్య భవనాలను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. కుమార్తె కామ్నా వాజ్‌పేయి గుర్గావ్ ప్రతిరోజూ సందర్శిస్తున్నారు. సుదేష్ ధన్కర్ చివరిసారిగా జైపూర్‌కు 7-10 రోజుల క్రితం ప్రైవేట్ సందర్శనకు వచ్చారని సమాచారం. జైపూర్ విమానాశ్రయం నుంచి కేవలం 15 నిమిషాల దూరంలో న్యూ సంగనేర్ రోడ్‌లో ఈ నిర్మాణం ఉంది.

అన్నామలైకు మంత్రి కుమారుడి షాక్

చెన్నై: తమిళనాడులో ప్రస్తుతం నిరసన రాజకీయాలు నడుస్తున్నాయి. బీజేపీకి వ్యతిరేకంగా అధికార పార్టీ నేతలు నిరసనలు తెలుపుతున్నారు. ఇటీవల ఓ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో గవర్నర్ రవి దగ్గర నుంచి డీఎంకే నేత భార్య జీన్ జోసెఫ్ డిగ్రీ పట్టా తీసుకునేందుకు నిరాకరించారు. వైస్ ఛాన్సలర్ దగ్గర తీసుకుని వెళ్లిపోయారు. గవర్నర్ తమిళ వ్యతిరేకి అని... అందుకే పట్టా తీసుకోలేదని ఆమె తెలిపారు. తాజాగా బీజేపీ నేత అన్నామలైకు కూడా అదే మాదిరిగా చేదు అనుభవం ఎదురైంది. క్రీడా కార్యక్రమంలో పతకం మెడలో వేస్తుండగా ఓ మంత్రి కుమారుడు నిరాకరించాడు. ఈ పరిణామంతో ఒకింత అన్నామలై షాక్‌కు గురయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. రాష్ట్ర షూటింగ్ క్రీడలకు ముఖ్యఅతిథిగా అన్నామలై ఆహ్వానింపబడ్డారు. అనంతరం విజేతలకు మెడలో పతకాలు వేస్తున్నారు. ఈ క్రమంలో తమిళనాడు పరిశ్రమల మంత్రి టీఆర్‌బీ రాజా కుమారుడు సూర్య రాజ బాలు వంతు వచ్చింది. పతకం మెడలో వేస్తుండగా నిరాకరించాడు. చేతిలో తీసుకుని వెళ్లిపోయాడు. ఈ క్రమంలో అన్నామలై ఫొటో దిగి వెళ్లిపోయారు. గవర్నర్‌కు జరిగిన రెండు వారాలకే అన్నామలైకు ఇలాంటి అవమానం జరగడం చర్చనీయాంశమవుతోంది. అయితే ఈ నిరసనను అన్నామలై ఖండించారు. ఇదొక దురదృష్టకర నాటకం అని అభివర్ణించారు. పాఠశాలలు, విశ్వవిద్యాలయాల్లోకి రాజకీయాలు తీసుకురావొద్దని విజ్ఞప్తి చేశారు.

అధికారం కోసం బీజేపీ కుట్రలు: ప్రియాంక

సుపౌల్: ప్రజల నమ్మకాన్ని కోల్పోయినందునే వారి ఓట్లను దొంగలించి గద్దెనెక్కాలని బీజేపీ కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా విమర్శించారు. బీహార్‌లో లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో ఓటరు అధికార్ యాత్ర ఉత్సాహంగా సాగుతోంది. మంగళవారం సుపౌల్‌లో కొనసాగింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ తదితర ఇండియా ఐక్య సంఘటన నాయకులతో కలిసి ప్రియాంక పాల్గొన్నారు. ఎస్‌యూవీపై నుంచి ప్రజలకు అభివాదం చేశారు. 'బీహార్‌లో బీజేపీ-జేడీయూ ప్రభుత్వం అన్ని విధాలా విఫలమైంది. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, వలసలు, ఆర్థిక సంక్షోభం నివారించలేకపోయింది. దీంతో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. ఇప్పుడు అధికారం కోసం ఓట్లు దొంగలించేందుకు కుట్రలు చేస్తోంది' అని ప్రియాంక విమర్శించారు.

పత్తికి సీ2+50 శాతం ఎంఎస్‌పీ

- దిగుమతి సుంకాల రద్దుపై నోటిఫికేషన్ ఉపసంహరణ
- ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ.25లక్షలు
- సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రైతాంగానికి హామీనిచ్చే విధంగా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కి చట్టబద్ధత కల్పించాలని, పత్తిపై దిగుమతి సుంకాలు రద్దు చేసే నోటిఫికేషన్‌ను తక్షణమే ఉపసంహరించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్‌కేఎం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. పత్తిపై దిగుమతి సుంకం రద్దు చేస్తే 60 లక్షల పత్తి రైతు కుటుంబాలు జీవనోపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ చర్య దేశీయ పత్తి ఉత్పత్తిని తీవ్రంగా దెబ్బతీస్తుందని, ఇప్పటికే పత్తి ధర పడిపోతోందని, రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుపోతున్నారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకునేలా ఒత్తిడి తెచ్చేందుకు పోరాడాలని, దానిని మరింత ఉధృతం చేయాలని రైతులకు సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చినట్లు ప్రకటన వెల్లడించింది. అలాగే, వ్యవసాయానికి, రైతుల సంక్షేమానికి విఘాతం కలిగించే స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) వద్దని పేర్కొంది. దిగుమతి సుంకాల రద్దును తక్షణమే డీ నోటిఫై చేయాలని, పత్తికి ఎంఎస్‌పీ సీ2 + 50 శాతం కల్పించాలని, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ.25 పరిహారం ఇవ్వాలని ఎస్‌కేఎం డిమాండ్ చేసింది. పత్తి రైతుల్లో ఆత్మహత్యలు పెరిగాయని, సెప్టెంబరు 17, 18 తేదీల్లో మహారాష్ట్రలోని విదర్భాలో ఎస్‌కేఎం బృందం పర్యటిస్తుందని రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య వెల్లడించారు. పత్తిపై 11 శాతం దిగుమతి సుంకం రద్దు కోసం ఈనెల 19న ఇచ్చిన నోటిఫికేషన్ వెనక్కి తీసుకోవాలని ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. ఇందుకోసం తీర్మానించేందుకు సెప్టెంబరు 1,2,3 తేదీల్లో పత్తి సాగు చేసే గ్రామాల్లో బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ తీర్మానాన్ని ప్రధానికి పంపుతామని చెప్పారు. ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రతులకు నిప్పు పెట్టి గ్రామీణ స్థాయిలో నిరసనలు తెలపాలని రైతులకు పిలుపునిచ్చారు. పత్తికి సీ2+50 శాతం ఎంఎస్‌పీ... క్వింటా ధర రూ.10,075గా ప్రకటించాలని రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో గ్రామ సభలు ఏర్పాటు చేసి తీర్మానించేందుకు గ్రామస్థాయి బహిరంగ సభల ఏర్పాటుకు స్థానిక సంఘాల తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించారు. సెప్టెంబరు 10 నాటికి ఆయా స్థానిక సంఘాల అధ్యక్షులకు వినతిపత్రాల అందజేతకు మద్దతుగా సంతకాల సేకరణ, ఇంటింటికి కరపత్రాల పంపిణీ వంటివి చేపట్టనున్నట్లు వెల్లడించారు. తమ డిమాండ్‌పై ప్రధాని తక్షణమే చర్యలు తీసుకోకపోతే పత్తి రైతులు మండల్ పంచాయత్‌లు నిర్వహిస్తారని, పార్లమెంటు సభ్యులను చేరుకునేందుకు నిరసన ప్రదర్శనలు చేపడతారని క్షీరసాగర్, రావుల వెంకయ్య హెచ్చరించారు. ఇందుకోసం తేదీని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర సమన్వయ కమిటీలు త్వరలో నిర్ణయిస్తాయన్నారు. పత్తి సాగు చేసే 11 రాష్ట్రాల్లో సభలు నిర్వహించి, పత్తి రైతులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణను ఈ కమిటీలు నిర్ణయిస్తాయని క్షీరసాగర్, వెంకయ్య వెల్లడించారు.

ట్రంప్ సుంకాలు నేటి నుంచి అమలు

ప్రభావం... తీసుకోవాల్సిన చర్యలపై ప్రధాని సమీక్ష

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. భారత్ నుంచి జరిగే ఎగుమతులపై 50 శాతం సుంకాలను ట్రంప్ సర్కారు వసూలు చేయనుంది. తొలుత 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్... రష్యా నుంచి చమురు కొనుగోళ్లను సాకుగా చూపి మరో 25 శాతం సుంకాలు విధించారు. ఇందుకోసం ఎగ్జిటీవ్ ఆర్డర్‌పై ఈనెల 6న ఆయన సంతకం చేశారు. భారత్ వస్తువులపై కొత్త సుంకాలు 27వ తేదీ అర్ధరాత్రి 12.01 గంటల నుంచి అమల్లోకి వస్తాయని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ద్వారా హోమ్‌లాండ్ ఆఫ్ సెక్యూరిటీ విడుదల చేసిన నోటీసుల్లో పేర్కొంది. ఈ సుంకాల ప్రభావం, ఎగుమతిదారుల కోసం తీసుకునే చర్యలను ప్రధాని మోదీ మంగళవారం సమీక్షించారు. ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ)లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రధాని ప్రిన్సిపల్ కార్యదర్శి అధ్యక్షతన వాణిజ్య-పరిశ్రమల శాఖతో సహా సంబంధిత ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపారు. అమెరికా విధించిన 50 శాతం సుంకాలు అమలుతో భారత్‌లో వ్యవసాయం, ఫార్మా, జౌళి, చర్మ ఉత్పత్తులపై ప్రభావం పడుతందని నిపుణులు ఇప్పటికే హెచ్చరించారు. ఈ క్రమంలో ఎగుమతులపైనే ఆధారపడిన పరిశ్రమలు, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎస్ఎంఈలు)లపైనే ప్రధానంగా దృష్టి సారించాలని ప్రభుత్వ వ్యూహమని అధికారులు తెలిపారు. ఎగుమతిదారులకు ఎలాంటి భరోసా కల్పించాలో సంబంధిత అధికారులతో ప్రధాని చర్చించారు.

డ్యామ్‌ల నుంచి నీరు విడుదలపై భారత్ హెచ్చరిక

- లక్షల మందిని తరలించిన పాకిస్థాన్
- రావి, సట్లెజ్, చీనాబ్ నదులకు పొంగిపొర్లుతున్న వరద
- వందలాది గ్రామాలు ఖాళీ

న్యూఢిల్లీ/ఇస్లామాబాద్: భారత్ నుంచి వెలువడిన కీలక హెచ్చరికతో పాకిస్థాన్‌లో తీవ్ర ఆందోళన నెలకొంది. తమ డ్యామ్‌ల నుంచి అదనపు జలాలను విడుదల చేయనున్నట్లు భారత్ ప్రకటించడంతో, పాకిస్థాన్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందుజాగ్రత్త చర్యగా, దేశ వ్యవసాయానికి గుండెకాయ లాంటి పంజాబ్ ప్రావిన్స్‌లోని మూడు నదుల పరీవాహక ప్రాంతాల నుంచి ఏకంగా 1,50,000 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. భారత్, పాకిస్థాన్ దేశాలు గత కొన్ని వారాలుగా కుండపోత వర్షాలు, వరదలతో అతలాకుతల మవుతున్నాయి. ఈ క్రమంలో, భారత పంజాబ్‌లోని డ్యామ్‌లు ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో మిగులు జలాలను నదుల్లోకి వదిలేందుకు సిద్ధమైనట్లు సోమవారం భారత్ తమకు సమాచారం ఇచ్చిందని పాకిస్థాన్ అధికారులు తెలిపారు. ఈ నీరు పాకిస్థాన్‌లోకి ప్రవహించే రావి, సట్లెజ్, చీనాబ్ నదులలో కలవనుండటంతో వరద ముప్పు పొంచివుంది. ఈ నేపథ్యంలో, పాకిస్థాన్ జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టింది. ఈ మూడు నదుల తీరంలో ఉన్న వందలాది గ్రామాలను ఖాళీ చేయించి, ప్రజలను సురక్షిత శిబిరాలకు తరలిస్తున్నట్లు పాక్ విపత్తు నిర్వహణ అధికారి మజార్ హుస్సేన్ వెల్లడించారు. రానున్న రోజుల్లో భారత్ నుంచి నియంత్రిత పద్ధతిలో నీటి విడుదల ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, భారీ వర్షాల కారణంగా పాకిస్థాన్‌కు దౌత్య మార్గాల ద్వారా హెచ్చరికలు జారీ చేసినట్లు భారత ప్రభుత్వ వర్గాలు ధృవీకరించాయి. వర్షాలు కొనసాగితే మరిన్ని హెచ్చరికలు జారీ చేసే అవకాశం ఉందని ఆ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉన్న తరుణంలో, ఈ వరద పరిణామాలు సంబం ధాలపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

సంజయ్‌కు 9 వరకు రిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఐపీఎస్ అధికారి సంజయ్‌కు విజయవాడ ఏసీబీ కోర్టు సెప్టెంబరు 9 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. నాలుగు వారాల్లో లొంగిపోవాలని సంజయ్‌ను గతంలో సుప్రీం కోర్టు ఆదేశించింది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలతో మంగళవారం ఆయన ఏసీబీ కోర్టులో లొంగిపోయారు. అగ్నిమాపక, సీఐడీ డీజీగా ఉన్నప్పుడు సంజయ్ అవకతవకలకు పాల్పడ్డారంటూ నమోదయిన కేసుపై న్యాయస్థానం ఆదేశాలిచ్చింది.

సునీల్‌కుమార్ సస్పెన్షన్ ఫిబ్రవరి 24 వరకు పొడిగింపు

ఐపీఎస్ అధికారిగా ఉన్న పీవీ సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను వచ్చే ఏడాది ఫిబ్రవరి 24 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ పర్యటనలకు వెళ్లారన్న అభియోగాలు నిరూపణ కావడంతో ఆయనపై ప్రభుత్వం వేటు వేసింది. రెండు రోజుల్లో సస్పెన్షన్ గడువు ముగియనుండటంతో రివ్యూ కమిటీ సమీక్ష నిర్వహించింది. అగ్రిగోల్డ్ నిధుల దుర్వినియోగంపై సునీల్ కుమార్‌పై ఏసీబీ విచారణ కొనసాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఎంపీగా ఉన్న రఘురామకృష్ణరాజును వేధించారనే ఆరోపణల కేసులోనూ గుంటూరు నగరపాలెం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సస్పెన్షన్ ఎత్తివేస్తే సాక్ష్యాధారాలు, దర్యాప్తును ప్రభావితం చేస్తారని రివ్యూ కమిటీ వేసింది. దర్యాప్తు కీలక దశలో ఉన్నందున సస్పెన్షన్ పొడిగించాలని ప్రతిపాదించింది. ఈ క్రమంలో తదుపరి చర్యలు తీసుకోవాలని డీజీపీని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను పొడిగిస్తూ సీఎస్ విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు.

ఎన్నికల తేదీల నిర్ణయం బీజేపీదే

రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణ

మధుబని (బీహార్) : ఎన్నికల్లో ఓట్ల చోరీకి పాల్పడి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. ఎన్నికల సంఘం అధికార బీజేపీకి అనుకూలంగా పనిచేస్తోందని మరోసారి ఆరోపించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వాటి తేదీని ఎన్నికల కమిషన్‌కు బదులుగా బీజేపీ నిర్ణయిస్తోందని తీవ్ర ఆరోపణ చేశారు. ఓట్ల చోరీపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ఎందుకు ఒక్కమాట కూడా మాట్లాడట్లేదని ప్రశ్నించారు. 'ఓటరు అధికార యాత్ర'లో భాగంగా బీహార్‌లో పర్యటిస్తున్న రాహుల్‌గాంధీ మంగళవారం మధుబనిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వం మరో 40 ఏళ్ల పాటు అధికారంలో ఉంటుందని అమిత్ షా అన్నారని, ఆ విషయం ఆయనకు ఎలా తెలుసని రాహుల్ ప్రశ్నించారు. ఓట్ల చోరీకి పాల్పడితే ఎన్నేళ్లయినా అధికారంలో ఉండవచ్చని ఎద్దేవా చేశారు. కొన్నేళ్ల క్రితం గుజరాత్ ఎన్నికల్లో మొదలైన ఈ ఓట్ల చోరీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం వరకు వచ్చిందని అన్నారు. ప్రతి రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కచ్చితంగా ఎన్నికల తేదీలను మారుస్తారని ఆరోపించారు. వీటి గురించి ఎవరూ ప్రశ్నించకుండా, ఎన్ని అక్రమాలు జరిగినా ఎన్నికల కమిషన్‌పై కేసు నమోదు చేయకుండా చట్టం తీసుకొచ్చారని అన్నారు. మహారాష్ట్ర, కర్నాటక, మణిపూర్ లాంటి రాష్ట్రాల్లో ఎక్కడెక్కడ కొత్త ఓటర్లు వచ్చారో అక్కడ బీజేపీ విజయం సాధించిందని చెప్పారు. ఎన్నికల కమిషన్ అధికారులు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలని రాహుల్ సూచించారు. ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై ఎప్పటికైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీహార్ ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు ఇండియా ఐక్య సంఘటన ఎంత దూరమైనా వెళుతుందోని అన్నారు. ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని ఎప్పుడూ గౌరవించలేదని, అది రాజ్యాంగ విలువలకు వ్యతిరేకమని అన్నారు. ఇప్పుడు మనం ఓటు హక్కును కోల్పోతే రాజ్యాంగాన్ని ఎన్నటికీ రక్షించుకోలేమని చెప్పారు.

బాబు, జగన్ వినాయక చవితి శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: వినాయక చవితి సందర్భంగా ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేస్తూ.. మీ కుటుంబ ప్రగతికి, మీ లక్ష్యాలకు ఎలాంటి విఘ్నాలు కలుగకుండా ఆ గణపతి మిమ్మల్ని అనుగ్రహించాలని కోరుకుంటున్నాను. వాడవాడలా మండపాలు నెలకొల్పి భక్తి శ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో గణేశుని పూజిస్తున్న ప్రజలకు సకల శుభాలు కలుగజేయాలని ఆ వినాయకుని ప్రార్థిస్తున్నాను అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ గణనాథుని ఆశీస్సులు ఉండాలని, క్షేమ, స్థైర్య, ఆయురారోగ్యాలు, సకల సంపదలు సిద్ధించాలని, సకల శుభాలు కలగాలని వైఎస్ జగన్ ఆకాంక్షించారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో మంచి పనులకు విఘ్నాలు తొలగిపోయి, ప్రజలందరికీ సకల శుభాలూ కలగాలని, విజయాలు సిద్ధించాలని.. ఇంకా గణనాథుని కరుణా కటాక్షాలతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో అభివృద్ధి చెందాలని ఎక్స్ వేదికగా జగన్ అభిలషించారు.

ఆపరేషన్ సిందూర్ ముగియలేదు

- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- ఉదయగిరి, హిమగిరి యుద్ధ నౌకలు జాతికి అంకితం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కొత్తగా తయారు చేసిన యుద్ధ నౌకలు 'ఉదయగిరి (ఎఫ్35)... హిమగిరి (ఎఫ్34) ని మంగళవారం స్థానిక నావెల్ డాక్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ జాతికి అంకితం చేశారు. ఈ నౌకలను డిజైన్, స్టెల్త్, ఆయుధాలు, సెన్సార్ వ్యవస్థల్లో అత్యాధునిక సాంకేతికతో తయారు చేశారు. దేశంలోని వేర్వేరు షిప్ యార్డులలో నిర్మించిన రెండు ఫ్రంటైన్ సర్ఫేస్ యుద్ధ నౌకలను ఒకేసారి జాతికి అంకితం చేయడం ఇదే ప్రథమం. బ్లూ వాటర్ పరిస్థితుల్లో రక్షణ బాధ్యతలను నిర్వర్తించే సామర్థ్యం ఈ నౌకల సొంతంగా రూపొందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రక్షణ మంత్రి మాట్లాడుతూ ఈ రెండు నౌకలు బహుళ పాత్రలు పోషించనున్నాయని, స్వదేశీ యుద్ధ నౌక సామర్థ్యానికి ప్రతీక అని అన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌కు ఇవి నిదర్శనమని, సాంకేతిక పరిజ్ఞానం ఈ నౌకల తయారీలో ప్రతిబింబిస్తోందని చెప్పారు. 2050 నాటికి 200 యుద్ధ నౌకలు నిర్మాణం చేస్తామన్నారు. అత్యాధునిక సాంకేతికతతో నిర్మితమైన నీలగిరి క్లాస్లో కీలకమైన ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరి యుద్ధ నౌకలు భారత రక్షణ శాఖ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ... మంగళవారం నౌకాదళ అమ్ములపొదిలో చేరాయి. అత్యాధునిక ప్రాజెక్ట్-17లో భాగంగా మల్టీ-మిషన్ స్టెల్త్ ఫ్రిగేట్లుగా రూపుదిద్దుకున్న వీటిని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ త్రిపాఠీ జాతికి అంకితం చేశారు. ముంబైలోని మజగాన్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్) లో ఉదయగిరి, కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ ఇంజనీర్స్ (జీఆర్ఎస్ఈ) లో హిమగిరి యుద్ధ నౌకలు నిర్మించారు. ఆధునిక కంబైన్డ్ డీజిల్ లేదా గ్యాస్ (సీఓడీఓజీ) ప్రొపల్షన్ ప్లాంట్లు, అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ ప్లాట్‌ఫామ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థతో పాటు దేశీయ సాంకేతికతతో అభివృద్ధి చేసిన అత్యాధునిక ఆయుధాలు, సెన్సార్ల సూట్స్ ఉన్న ఈ నౌకలకు సముద్ర జలాల్లో నిర్దేశిత లక్ష్యాలను నూరు శాతం పూర్తిచేయగల సామర్థ్యం ఉంది. హిందూ మహాసముద్ర ప్రాంతం అంతటా సముద్ర ప్రయోజనాలను కాపాడుకునేందుకు, దేశ సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి ముఖ్య భూమిక పోషించనున్నాయి. 75 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ యుద్ధ నౌకలు అనేక రికార్డులను సొంతం చేసుకున్నాయని నావికాదళ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పు నావికాదళ అధికారి రాజేష్ పెందర్కర్, ఎంపీ సీఎం రమేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 32299/79, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.